



దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!

సంపుటి : 02 సంచిక : 251 బుధవారం 24-09-2025 ఎడిటర్ వేముల అయోధ్య రాములు పేజీలు : 6 వెల : 5/-

# మేడారం కీర్తిని ప్రపంచానికి చాటుతాం

- గిరిజన కుంభమేళపై కేంద్రం వివక్ష
- కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి
- ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులు పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క సారలమ్మ
- సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పాటు
- 68 కేజీల నిలువెత్తు బంగారం సమర్పించిన సిఎం



హైదరాబాద్: మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ములుగు జిల్లా, తాడ్వాయి మండలం, మేడారంలో వన దేవతలను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు 68 కేజీల నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం మేడారంలో గిరిజన సంక్షేమ శాఖ, దేవాదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు, పూజారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళిక, డిజైన్లను పూజారులు, ఆదివాసీ సంఘాలకు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను సిఎం తెలుసుకున్నారు. ఆలయాన్ని విస్తరణ, అభివృద్ధిని ముక్తకంఠంతో పూజారులు, ఆదివాసీ సంఘాలు ఏకీభవించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించి పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి ఆదివాసీ సంఘాలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..మేడారం వన దేవతల కీర్తిని ప్రపంచానికి చాటుతామని అన్నారు. ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులని, ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.మేడారంలో వంద రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించాలని, ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా సమ్మక్క సారలమ్మ ఆలయం ఉందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వాములైన వారి జన్మ ధన్యమవుతుందని అన్నారు. ఇలాంటి అవకాశం ఈ జన్మకు దక్కిన వరం లాంటిది%ౌ%.ఆదాయం ఆశించి కాదు.. భక్తితో పనిచేయాలని సూచించారు. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించేలా పనిచేయాలన్నారు.

జంపన్న వాగులో నీటి నిల్వ ఉండేలా సాగునీటిపారుదల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైనచోట చెక్ డ్యామ్‌లు నిర్మించాలని, రాబోయే వంద రోజులు సమ్మక్క సారలమ్మ మాలధారణ చేసినట్లుగా నిష్ఠతో పనిచేయాలన్నారు. నిధులు గ్రీన్ చానల్‌లో విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. పనులు పూర్తి చేయించుకునే బాధ్యత మీపై ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక డెడికేటెడ్ టీమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండేళ్లకు ఒకసారి జరిగే మహా జాతరకు విచ్చేసే భక్తులకు మరింత సౌకర్యవంతంగా ప్రభుత్వ పక్షాన కల్పించాలనే ధ్యేయంతో, గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని సమ్మక్క సారమ్మల గద్దెల ప్రాంగణం పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకునే, వారిని భాగస్వాములను చేస్తూ ఆలయ అభివృద్ధి ఉంటుందని స్పష్టం చేశారు.అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు

మిగతా 2లో




## కృష్ణా జలాల్లో వాటాపై రాజీలేని పోరాటం

- తెలంగాణకు చారిత్రక అన్యాయం ఇకపై కొనసాగదు
- కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్ 2 ముందు వాదనలు
- తెలంగాణ హక్కులను తప్పకుండా దక్కించుకుంటాం
- మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో కృష్ణా ట్రైబ్యునల్‌లో తుది వాదనలు

**హైదరాబాద్ :** కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు న్యాయమైన వాటా రావాలని కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్ 2 ముందు తెలంగాణ వాదనలు వినిపిస్తోందని, మొత్తం 1050 టీఎంసీలలో దాదాపు 70 శాతం అంటే 763 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని రాష్ట్ర ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 23న ఢిల్లీలో మళ్లీ ప్రారంభమైన కృష్ణ ట్రైబ్యునల్ విచారణల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసు చివరి దశకు చేరుకుందని, ఫిబ్రవరి నుండి తెలంగాణ తుది వాదనలు వినిపిస్తున్నదని ఉత్తమ్ చెప్పారు. ఈ విచారణలు సెక్షన్-3 రిఫరెన్స్ కింద జరుగుతున్నాయని, అన్ని పిటిషన్లు పూర్తయ్యాయని గత కొన్ని నెలలుగా సీనియర్ అడ్వకేట్ ఎస్.వైద్యనాథన్ తెలంగాణ తరఫున వాదనలు వినిపిస్తున్నారని, ఆయనకు మూడు

మిగతా 2లో



## భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపాను... ఐరాసలోనూ ట్రంప్ అదే మాట!

- ఐరాస సర్వసభ్య సమావేశంలో మరోసారి పాత వ్యాఖ్యల పునరుద్ఘాటన
- తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై అసంతృప్తి
- ఉక్రెయిన్ యుద్ధానికి భారత్, చైనాలు రష్యాకు నిధులు ఇస్తున్నాయని ఆరోపణ
- యుద్ధాలను ఆపడంలో ఐక్యరాజ్యసమితి విఫలమైందని తీవ్ర విమర్శ
- యూరప్ దేశాలు రష్యాపై ఆంక్షలు విధించకపోతే తీవ్ర

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన పాత వాదనను పునరుద్ఘాటించారు. ఇటీవల భారత్, పాకిస్థాన్‌ల మధ్య తీవ్రస్థాయికి చేరిన ఘర్షణను తానే నివారించానని, తన వల్లే యుద్ధం ఆగిపోయిందని చెప్పుకొచ్చారు. ఐక్యరాజ్యసమితి (ఐరాస) సర్వసభ్య సమావేశంలో మంగళవారం ప్రసంగించిన ఆయన, ఈ ఘనత తనదేనని చెబుతూనే.. తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై తన ఆవేదనను వెళ్లగక్కారు. ఐరాస ఉన్నతస్థాయి సమావేశంలో సుదీర్ఘంగా ప్రసంగించిన ట్రంప్, "నేను ఏడు యుద్ధాలను ముగించాను. అవన్నీ

మిగతా 2లో

## డాలర్‌తో పోలిస్తే 88.75కి పతనం

న్యూఢిల్లీ : అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత పడిపోయింది. మంగళవారం ట్రేడింగ్‌లో 47 పైసలు క్షీణించి 88.75కి చేరింది. రెండు వారాల క్రితం దాని ఆల్ టైమ్ కనిష్ట స్థాయి 88.46 కంటే దిగువకు పతనమైంది. ఆసియా మార్కెట్లలో డాలర్ స్వల్పంగా తగ్గిన నేపథ్యంలో ఈ క్షీణత సంభవించింది. ఆసియా కరెన్సీల బలహీనత, అమెరికా డాలర్ బలపడటం వల్ల రూపాయి విలువ తగ్గిందని నిపుణులు అంటున్నారు. దీనికి తోడు, అమెరికా సుంకాలు, హెచ్1బి వీసా ఫీజు పెంపు కారణంగా రూపాయి విలువ దెబ్బతింటోంది. 2025లో ఇప్పటివరకు రూపాయి 3.25 శాతం బలహీనపడింది. జనవరి 1న డాలర్‌తో పోలిస్తే 85.70 వద్ద ఉన్న రూపాయి ఇప్పుడు 88.49కి చేరుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కొత్త విధానాలు కూడా రూపాయిపై భారం వేస్తున్నాయని కరెన్సీ నిపుణులు అంటున్నారు.

## రెండు అమెరికా కంపెనీలకు భారత సంతతి సిఇఒల నియామకం



2లో

## బంగారం ఆల్ టైమ్ రికార్డు.. తులం రూ.1,18,900

- పది గ్రాముల పసిడి ధర రూ.1,18,900
- ఒక్క రోజే రూ.2,700 పెరిగిన రేటు
- కిలో వెండి రూ.3,220 పెరిగి రూ.1,39,600కి చేరిక



2



## పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుంది..

**హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హామీ ఇచ్చారు. ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి ఆధ్వర్యంలో మాజీ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా రెపరెపలాడించాలని

మిగతా 2లో

## 23 గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై 'సుప్రీం' స్టే



2

దిన పత్రిక
తొలి సమయం
బుధవారం 24 సెప్టెంబర్ 2025

# మేడారం కీర్తిని ప్రపంచానికి చాటుతాం

పొందిందని, ఈ జాతర తెలంగాణ ప్రజల ఆత్మీయత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ తల్లులని అన్నారు. తాను ఎంఎల్ఏగా ఎన్నికైనప్పటి నుంచి అమ్మవార్లను సందర్శిస్తున్నాన నని అన్నారు. 2023 ఫిబ్రవరి 6న ఈ గడ్డమీద నుంచే పాదయాత్ర మొదలుపెట్టానని, సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించి, శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామనివివరించారు. సంప్రదాయానికి గౌరవం ఇవ్వాలనే ఆలోచనతో మీ అభిప్రాయాలు తీసుకునేందుకు ఇక్కడికి వచ్చామని అన్నారు.సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే తమ ప్రభుత్వ అభిమతం అన్నారు. ఇది డబ్బులతో కొలిచేది కాదు.. నమ్మకంతో కొలిచేదని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా అభివృద్ధి ఉండాలన్నారు. మేడారం జాతర తెలంగాణ సాంస్కృతిక గొప్పతనాన్ని, గిరిజనుల పోరాట చరిత్రను ప్రతిబింబిస్తుందని, ఈ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందేలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మేడారంలో సమ్మక్క- సారలమ్మ గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల డిజైన్లను విడుదల చేశారు. తెలంగాణ ప్రాంతంలో ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో ఉన్న సమ్మక్క సారలమ్మ ప్రాంగణం కూడా ఒక గొప్ప దేవాలయమని, ఈ జాతరకు ఎన్నో ఏళ్ల చరిత్ర పోరాట ప్రతిమ రాచరికంపై తిరుగుబాటు జెండా ఎగరేసిన సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హెూదా కల్పించాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆసియాలోని అతి పెద్ద గిరిజన జాతర తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని పునరుద్ధరించడం కోసం స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గద్దెల పునరుద్ధరణలో భాగంగా భక్తుల విశ్వాసం, నమ్మకం, ఆదివాసీల ఆచార సాంప్రదాయాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా జాతర ప్రాశస్త్యం అనేక శతాబ్దాలు గుర్తిండిపోయేలా ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. వనదేవతల ప్రాంగణాన్ని పూర్తిగా గ్రానైట్ రాయి తో నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. సమ్మక్క సారలమ్మ చరిత్ర 13వ శతాబ్దంలో మొదలైందని మరో వెయ్యి సంవత్సరాలు జాతర వైభోగం, ఆదివాసి సాంప్రదాయాలు, గుర్తుండేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు.

గతంలో సమ్మక్క సారలమ్మ మహా జాతరను అధికారికంగా నిర్వహించే అవకాశం ఇవ్వాలని కోరామని, అదే మాదిరిగా తన కోరికను తీరుస్తూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు జరిగి జాతరను అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరమే మేడారం ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలని స్వయంగా ముఖ్యమంత్రితో చర్చించామని, అదే మాదిరిగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారని, కనుక వెంటనే అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ ఆసీసుల ద్వారా సకల జనులు బాగుంటారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తల్లుల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. వెయ్యేళ్ళ పాటు పటిష్టమైన రీతిలో ఉండేలా నిర్మాణం ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. గద్దెల విస్తరణ విషయంలో అనేక అపోహలు ఉన్న నేపథ్యంలో నిర్మాణం ఏ విధంగా జరగాలని, ఆచార సాంప్రదాయాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడడం కోసం స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడికి రావడం అనేది చాలా సంతోషంగా ఉందని తల్లుల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం వర్ధిల్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎసిలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎంఎల్ఎలు తెల్లం వెంకట్రావు, బాలు నాయక్, కడియం శ్రీహరి, డా. మురళీనాయక్, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, వెడ్మా బొజ్జు, సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు,ముందు ములుగు జిల్లా, ఎస్ఎస్ తాడ్వాయి మండలం, మేడారంనకు హెలికాప్టర్ లో 12 గంటల 27 నిముషాలకు చేరుకున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి , కొండా సురేఖ, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిలకు మంత్రులు దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మహబూబాబాద్, వరంగల్ పార్లమెంటు సభ్యులు పోరిక బాలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎంఎల్‌సిలు, శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పి డాక్టర్ శబరీష్ పుష్పగుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. హెలిపాడ్ నుండి కమాండ్ కంట్రోల్ రూం ప్రాంగణంలో ముఖ్యమంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. గిరిజన కొమ్ము కోయనృత్యంతో, గిరిజన సంప్రదాయం ప్రకారం గద్దెల వద్దకు సిఎంకు ఘన స్వాగతం పలికారు.

# కృష్ణా జలాల్లో వాటాపై రాజీలేని పోరాటం

తెలంగాణకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దే విధంగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. గత కేటాయింపులను వివరించిన ఉత్తమ్ కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్ అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1005టీఎంసీలు కేటాయించిందని గుర్తు చేశారు. వీటిలో 811 టీఎంసీలు 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా, 49 టీఎంసీలు 65శాతం డిపెండబిలిటీ ఆధారంగా, 145 టీఎంసీలు సగటు ప్రవాహాల ఆధారంగా కేటాయించబడ్డాయని వివరించారు. అదనంగా గోదావరి డైవర్షన్ ద్వారా 45 టీఎంసీలు ఇచ్చారని, మొత్తంగా 1050 టీఎంసీలు కేటాయించబడ్డాయని అన్నారు. సగటు ప్రవాహాల కంటే ఎక్కువగా వచ్చే నీటిని వినియోగించుకోవచ్చని కూడా స్వేచ్ఛ ఇచ్చారని, 2014 లో తెలంగాణ వేరుగా ఏర్పడిన తర్వాత ఇప్పుడు కొత్తగా బేసిన్ పారామీటర్ల ఆధారంగా వాటాను కోరుతోందని ఉత్తమ్ తెలిపారు. తెలంగాణ డిమాండ్ శాస్త్రీయమైనదని, అంతర్జాతీయంగా అంగీకరించబడిన పారామీటర్ల మీద ఆధారపడి ఉందని పేర్కొన్నారు. క్యాచ్‌మెంట్ ఏరియా, బేసిన్‌లోని జనాభా, కరవు ప్రాంతం విస్తీర్ణం, సాగు భూములు వంటి అంశాల ఆధారంగా లెక్కలు వేసి 75శాతం డిపెండబుల్ వాటర్‌లో 555 టీఎంసీలు, 65 శాతం డిపెండబుల్ వాటర్‌లో 43 టీఎంసీలు, సగటు ప్రవాహాల నుండి 120 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ నుండి మొత్తం 45 టీఎంసీలు తెలంగాణకు రావాలని కోరుతున్నారు. మొత్తంగా ఇది 763 టీఎంసీలుగా అవుతుంది. సగటు ప్రవాహాలపై మిగిలిన అదనపు నీటిని వినియోగించే స్వేచ్ఛ కూడా తెలంగాణదేనని ఆయన స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్ ఇలాంటివి ఆపాలి : ఆంధ్రప్రదేశ్ తనకు కేటాయించబడిన 811 టీఎంసీల్లో పెద్ద భాగాన్ని బేసిన్ వెలుపలికి మళ్లించిందని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఇలాంటివి ఆపాలని, బదులుగా ప్రత్యామ్నాయ వనరులను వినియోగించాలని ట్రైబ్యునల్ ముందు తెలంగాణ విన్నవించుకుందన్నారు. అలా మిగిలిన నీటిని ప్రాంతాల్లో వాడుకోవాలని కోరారు. సగటు ప్రవాహాలపై మిగిలిన మొత్తం నీటిని వినియోగించే హక్కు తెలంగాణకే ఉందని, దీన్ని ట్రైబ్యునల్ ముందు బలంగా వాదిస్తామని అన్నారు. ఇది కేవలం ఒక డిమాండ్ మాత్రమే కాకుండా, దశాబ్దాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిచేసే చర్య అని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 299 టీఎంసీలను తెలంగాణకే కేటాయిస్తూ, 512 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ఒప్పందానికి అంగీకరించడం రైతులకూ, కరవు ప్రాంతాలకూ మోసం చేశారని ఉత్తమ్ అన్నారు. దాదాపు పది సంవత్సరాల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని అంగీకరించిందని, అందుకే ఇప్పుడు ఆ ఫైలును మళ్లీ తెరిచి మొదటి నుంచి వాదనలు వినిపిస్తున్నామని చెప్పారు. 299 టీఎంసీలు అంగీకరించిన గత ఒప్పందం, తాము కోరుతున్న 763 టీఎంసీల మధ్య వ్యత్యాసమే ఈ అన్యాయానికి నిదర్శనమని అన్నారు. జలశక్తి మంత్రిత్వశాఖలో కూడా ఆ ఒప్పందం నమోదైనప్పటికీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారికంగా తిరస్కరించిందని చెప్పారు.ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాజీపడం : పొరుగు రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా తెలంగాణ రాజీపడబోదని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఉన్నా, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి ఉన్నా, మహారాష్ట్రలో బిజెపి ఉన్నా, తెలంగాణ తన హక్కుల కోసం కఠినంగా పోరాడుతుంది. ఒక్క చుక్క నీళ్లను కూడా వదులుకోదు, అని ధీమా వ్యక్తం చేశారు. అల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే కర్ణాటక యోచనను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. అలాంటి నిర్ణయం తెలంగాణకు నేరుగా నష్టం చేస్తుందని హెచ్చరించారు. దీనిని అడ్డుకోవడానికి సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపిస్తామని అన్నారు. మా ప్రభుత్వ అభిప్రాయం చాలా స్పష్టంగా ఉంది. తెలంగాణ వాటా తగ్గించే చర్య ఏదీ అనుమతించమని చెప్పారు. అల్మట్టి ఎత్తు పెంపు అనుమతించకుండా సుప్రీంకోర్టులో పోరాడతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్నదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కేసుపై సమీక్ష సమావేశం నిర్వహించి పూర్తి స్థాయి వాదనలు వినిపించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని ఉత్తమ్ తెలిపారు.ఇది కేవలం న్యాయ పోరాటం మాత్రమే కాదని రైతుల జీవనాధారానికి, కరవు ప్రాంతాల భవిష్యత్తుకు సంబంధించినదన్నారు. ట్రైబ్యునల్ న్యాయమూర్తి బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని విచారణలో తెలంగాణకు న్యాయం జరుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మేము మా వాదనలను అన్ని ఆధారాలతో సమర్పించామని వివరించారు. ఈ సారి తెలంగాణకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని ఉత్తమ్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గదని ప్రజలకు హామీ ఇచ్చారు. డిపెండబుల్ ఫ్లోస్ అయినా, సగటు ప్రవాహాలైనా, అదనపు నీరైనా, గోదావరి డైవర్షన్లు అయినా -తెలంగాణల తన హక్కు కోసం పోరాడుతుందని పునరుద్ఘాటించారు. చారిత్రక అన్యాయం ఇకపై కొనసాగదని, తెలంగాణ తన హక్కు దక్కించుకుంటుందని ఉత్తమ్ స్పష్టం చేశారు.

## రెండు అమెరికా కంపెనీలకు
# భారత సంతతి సిఇఓల నియామకం

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1బి వీసా నియమాలను కఠినతరం చేస్తున్న నేపథ్యంలో అక్కడి కంపెనీలు మాత్రం సిఇఒ స్థానాలకు భారతీయుల వైపే మొగ్గుచూపుతున్నాయి. తాజాగా అమెరికాలోని రెండు పెద్ద కంపెనీలు భారత సంతతికి చెందిన సిఇఒ (చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)లను నియమించాయి. దీనిలో మొదటి కంపెనీ అమెరికా టెలికాం దిగ్గజం టిమొబైల్, ఈ కంపెనీకి నవంబర్ 1 నుండి 55 ఏళ్ళ శ్రీనివాస్ శ్రీని గోపాలన్ సిఇఒగా బాధ్యతలు చేపట్టనున్నారు. రెండో కంపెనీ చికాగో కేంద్రంగా ఉన్న బేవరేజ్ దిగ్గజం మోల్సన్ కూర్స్, దీనికి రాహుల్ గోయల్ (49) అక్టోబర్ 1 నుండి కొత్త సిఇఒగా బాధ్యతలు స్వీకరించనున్నారు.ఐఐఎం అహ్మదాబాద్ ఆలుమ్నస్ గోపాలన్, ప్రస్తుతం టిమొబైల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. 2020 నుండి కంపెనీని నడిపించిన మైక్ సీవర్ట్, కొత్తగా రూపొందించిన వైస్ చైర్మన్ స్థానంలోకి మారుతున్నారు. టిమొబైల్ తదుపరి సిఇఒగా బాధ్యతలు చేపట్టడం గౌరవంగా భావిస్తున్నానని గోపాలన్ లింక్డ్ఇన్‌లో ప్రకటించారు. వినియోగదారులకు కొత్త రీతిలో సేవలందించడానికి సాహసోపేత మార్పులు చేయడం తనకెంతో ఇష్టమైందని అన్నారు. గోపాలన్ వృత్తి జీవితంలో అనేక దేశాలు, రంగాలలో పనిచేసిన అనుభవం ఉంది. హిందుస్తాన్ యూనిలివర్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా ప్రారంభించి, భారతి ఎయిర్‌టెల్, వోడాఫోన్, కాపిటల్ వన్, డాయ్చ్ టెలికాం వంటి కంపెనీల్లో సీనియర్ పాత్రలు నిర్వహించారు. జర్మనీలో మొబైల్ మార్కెట్ షేర్ రికార్డు సాధించి, ఫైబర్ నెట్‌వర్క్‌ను కోట్ల హెూమ్‌లకు విస్తరించారు. టిమొబైల్‌లో 5జి, ఎఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమాలను నడిపించారు. ఈ సందర్భంగా సీవర్ట్ మాట్లాడుతూ.. గోపాలన్‌ను అత్యంత నై పుణ్యవంతుడు, అద్భుత అవగాహనతో ఉన్న వ్యక్తి అని పేర్కొన్నారు.అమెరికాలో బేవరేజ్ దిగ్గజం మోల్సన్ కూర్స్ రాహుల్ గోయల్‌ను అక్టోబర్ 1 నుండి నూతన అధ్యక్షుడు, సిఇఒగా నియమించింది. 49 ఏళ్ళ గోయల్, గేవిన్ హాటర్స్‌లే స్థానంలో బాధ్యతలు చేపడుతున్నారు. భారతీయుడైన గోయల్ మైసూర్‌లో ఇంజనీరింగ్ చదివి, డెన్వర్‌లో బిజినెస్ స్టడీస్ కోసం అమెరికాకు వెళ్లారు. గోయల్‌కు అమెరికా, బ్రిటన్, భారత్‌లో కూర్స్, మోల్సన్ బ్రాండ్లలో అనుభవం ఉంది. మోల్సన్ కూర్స్ బోర్డు చైర్మన్ డేవిడ్ కూర్స్ మాట్లాడుతూ, సిఇఒ వారసత్వ ప్రక్రియ తర్వాత రాహుల్ సరైన అనుభవం, విజన్ సంస్థ తదుపరి వృద్ధికి దోహదం చేస్తుందని స్పష్టమైందని అన్నారు.

## భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపాను... ఐరాసలోనూ ట్రంప్ అదే మాట!

తీవ్రంగా కొనసాగుతున్నవే! వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్న సమయంలో నేను జోక్యం చేసుకున్నాను" అని తెలిపారు. "అందులో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన భీకర యుద్ధం కూడా ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ట్రంప్ వాదనను భారత్ ఇప్పటికే పలుమార్లు ఖండించింది. ఈ విషయంలో ట్రంప్ జోక్యం ఏమీ లేదని, ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారుల మధ్య జరిగిన చర్చల ద్వారానే సమస్య పరిష్కారమైందని ప్రధాని నరేంద్ర మోదీ గతంలోనే జూన్‌లో జరిగిన ఫోన్ సంభాషణలో ట్రంప్‌కు స్పష్టం చేశారు. పాకిస్థాన్ డీజీఎంఓ మేజర్ జనరల్ కాషిఫ్ అబ్దుల్లా, భారత డీజీఎంఓ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘయ్‌కు ఫోన్ చేసి కాల్పుల విరమణకు అంగీకరించారని భారత వర్గాలు వెల్లడించాయి.
ఇదే సమావేశంలో ట్రంప్.. భారత్, చైనాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగించేందుకు ఈ రెండు దేశాలు రష్యాకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని విమర్శించారు. మరోవైపు, రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్న నాటో మిత్రదేశాలు, యూరోపియన్ యూనియన్‌పైనా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "రష్యా యుద్ధాన్ని ఆపేందుకు సిద్ధపడకపోతే, అమెరికా శక్తిమంతమైన సుంకాలను విధించడానికి సిద్ధంగా ఉంది. ఈ సుంకాలు ప్రభావవంతంగా ఉండాలంటే యూరప్ దేశాలు కూడా మాతో కలవాలి" అని ఆయన హెచ్చరించారు.ప్రపంచంలో శాంతిని కాపాడటంలో ఐక్యరాజ్యసమితి పూర్తిగా విఫలమైందని ట్రంప్ దుయ్యబట్టారు. "ఈ పనులన్నీ ఐరాస చేయాల్సింది, కానీ నేనే చేయాల్సి వచ్చింది. విచారకరమైన విషయం ఏంటంటే, ఈ సందర్భాల్లో ఐరాస కనీసం సాయం చేసే ప్రయత్నం కూడా చేయలేదు" అని ఆయన విమర్శించారు. తన ప్రసంగం మధ్యలో టెలిప్రాంప్టర్ ఆగిపోయినా, ట్రంప్ తన ప్రసంగాన్ని ఆపకుండా కొనసాగించడం గమనార్హం.

## పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుంది.. ఎన్నికలకు సిద్ధంగా ఉండండి: హరీశ్ రావు

సూచించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దొంగ హామీలను గడపగడపకూ వివరించాలని హరీశ్ రావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను గ్రామాల్లో గడపగడపకూ వివరించాలని హరీశ్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ఎంతలా ఇబ్బంది పడుతున్నారో ప్రజలకు వివరించాలని సూచించారు.నెలల తరబడి రేషన్ కమీషన్ చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్ల జీవితాలతో చెలగాటం ఆడటం దుర్మార్గం అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్‌రావు మండిపడ్డారు. పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ, వారి ఆకలి తీర్చుతున్న రేషన్‌డీలర్లకు.. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల తీరుతో పస్తులుండే పరిస్థితి రావడం శోచనీయం అని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన కమీషన్ అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటుంటే ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దారుణమని అన్నారు. రేషన్ డీలర్లు మంగళవారం నగరంలోని తన నివాసంలో హరీశ్‌రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, అభయహస్తం పేరిట విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు 5 వేల గౌరవ వేతనంతో పాటు కమీషన్ పెంపు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు.అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా ఇప్పటికీ అతీగతీ లేదని, ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో నమ్మించి, ఇప్పుడు నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటలు తప్ప చేతలులేని కోతల ప్రభుత్వం ఇది అని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సచివాలయానికి రేషన్ డీలర్లను ఆహ్వానించి వారి సమస్యలను విని పరిష్కరించామని గుర్తు చేశారు. మెట్రిక్ టన్నుకు ఇచ్చే కమీషన్‌ను 900 నుంచి 1400 రూపాయలకు పెంచామని, ప్రభుత్వంపై 139 కోట్ల అదనపు భారం పడుతున్నా రేషన్ డీలర్ల సంతోషం కోసం కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. 2014లో మెట్రిక్ టన్నుకు 200 రూపాయలుగా ఉన్న కమీషన్‌ను, 1400 రూపాయలకు పెంచామని, 17వేలకు పైగా ఉన్న రేషన్ డీలర్ల ముఖాల్లో చిరునవ్వులు నింపామని అన్నారు. కమీషన్ చెల్లించడమే కాదు, కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100 మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్ మంజూరు చేశామని చెప్పారు.రేషన్ డీలర్‌షిప్ వయో పరిమితిని 40 నుంచి 50 ఏళ్లకు పెంచామని అన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీని సైతం అమలు చేయకుండా రేషన్ డీలర్ల పాలిట శకునిలా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రేషన్ డీలర్లకు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సంబురాన్ని లేకుండా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ వైఖరిని హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ కమీషన్,చెల్లించాల్సిన వెంటనే విడుదల చేయాలని కోరారు

## బంగారం ఆల్ టైమ్ రికార్డు..
## తులం రూ.1,18,900

న్యూఢిల్లీ : బంగారం, వెండి ధరలు రోజు రోజుకీ పరుగులు పెడుతూనే ఉ న్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో మం గళవారం 10 గ్రాముల పసిడి ధర ఏకంగా రూ.2700 పెరిగి రూ. 1,18,900కు చేరుకుంది. సురక్షితమైన ఆస్తిగా ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరగడం, అమెరికా హెచ్1బి వీసా పెంపు నేపథ్యంలో రూపాయి విలువ భారీగా పడిపోవ డం వంటివి బంగారం ధర పెరుగుదలకు కారణవుతున్నాయి. ఆల్ ఇండి యా సరఫ అసోసియేషన్ ప్రకారం, క్రితం రోజు 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర రూ.1,16,200 (10 గ్రాములు) వద్ద ముగిసింది. స్థానిక బులియన్ మార్కెట్లో 99.5 శాతం స్వచ్ఛత పసిడి రికార్డు స్థాయిలో రూ. 1,18,300 (10 గ్రాములు)కు చేరింది.ఇది సోమవారం రూ.1,15,650 ధరతో పోలిస్తే రూ.2,650 వద్ద ముగిసింది. ట్రేడర్ల ప్రకారం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ గణనీయంగా పడిపోయింది. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 10 గ్రాముల బంగారం ధర దాదాపు రూ.39,950 (50.60 శాతం) పెరిగింది. 2024 డిసెంబర్ 31న పసిడి ధర రూ.78,950 వద్ద ఉంది. ఇక వెండి కూడా బంగారం బాటలోనే పయనిస్తోంది. మంగళవారం కిలో వెండి ధర రూ.3,220 పెరిగి రూ.1,39,600 కు చేరుకుంది. సోమవారం రోజు ఇది రూ.1,36,380 వద్ద ఉంది.

## 23 గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై 'సుప్రీం' స్టే


తెలంగాణలోని ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామా లుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించగా, ఆయా గ్రామాల గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై 2013లో గిరిజన సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది.రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కనపెట్టి నిజాం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై స్థానికులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పరిగణించవద్దని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. 1950లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలో 23 గ్రామాలు లేవని గిరిజనేతరుల తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో స్టే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. మంగపేట మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల పైనా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది

## తాల్ హెల్త్‌ఫెస్ట్ 2025'కు కెటిఆర్‌కు ఆహ్వానం



భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావుకు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలో జరగనున్న ప్రతిష్టాత్మక 'తాల్ హాస్పిటల్స్ హెల్త్‌ఫెస్ట్ 2025' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ మంగళవారం ఒయు మాజీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్‌తో కలిసి తాల్ హాస్పిటల్స్ సిఇఒ సాయి గుండవెల్లి నగరంలో కెటిఆర్‌కు కలిసి ఆహ్వానించారు. 2025 అక్టోబర్ 24న కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో (యుసిఎస్‌డి)లో ఈ 'హెల్త్‌ఫెస్ట్ 2025' నిర్వహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య నిపుణులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, మార్పు తీసుకొచ్చేవారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భవిష్యత్ ఆరోగ్య సంరక్షణపై చర్చించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం.
ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ),వ్యక్తిగత వైద్యం, డిజిటల్ హెల్త్‌కేర్ ఆవిష్కరణలు, సమీకృత వైద్య సంరక్షణ, ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఆరోగ్య సేవలకు మార్గాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో కెటిఆర్ కీలకోపన్యాసం చేయనున్నారు. తెలంగాణలో టెక్నాలజీ ఆధారిత పాలన, ఆవిష్కరణలతో కూడిన అభివృద్ధి, ఆరోగ్య రంగంలో తీసుకువచ్చిన విధానాలు ప్రపంచ ప్రజలకు ఎంతో విలువైనవిగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.తమ ఆహ్వానాన్ని కెటిఆర్ అంగీకరించినందుకు టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ ధన్యవాదాలు తెలిపింది. హెల్త్‌ఫెస్ట్ 2025లో ఆయన భాగస్వామ్యం ఈ వేదికపై అర్థవంతమైన చర్చలకు దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## కోల్‌కతాలో భారీ వర్షాలు.. ఐదుగురు మృతి



కోల్‌కతా: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కోల్‌కతాను ముంచెత్తాయి. వరదల కారణంగా ఉత్తర కోల్‌కతా లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ షాక్ వల్ల ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, వరదల్లో కొట్టుకు పోయి మరో ఇద్దరు మరణించారు. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉన్నందున దక్షిణ బెంగాల్ లోని పలు జిల్లాల్లో రానున్న కొన్ని గంటల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వానల వల్ల పలు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగినట్టు విమానయాన సంస్థలు వెల్లడించాయి.అటు ఎయిరిండియా, ఇండిగో ప్రయాణికులకు అలర్ట్‌లు పంపించాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించాయి. భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు నీట మునిగాయి. ఈదురుగాలులకు చాలా ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. కొన్ని భవనాలు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రజులు సాధ్యమైనంతవరకు ఇళ్లలోనే ఉండాలని , అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. భారీ వరదల వల్ల షాహిద్ ఖుదిరామ్, మైదాన్ స్టేషన్ల మధ్య పలు రైల్వే కార్యకలాపాలను నిలిపివేసినట్టు అధికారులు పేర్కొన్నారు.ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు ప్రమాదకర స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్ , హిమాచల్ ప్రదేశ్‌లో కొండచరియలు విరిగి పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పంజాబ్, హర్యానా, చండీగఢ్‌ల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. పఠాన్‌కోట్, గుర్‌దాస్‌పుర్, ఫాజిల్కా, కపుర్థలా , తరన్‌తరన్, ఫిరోజ్‌పుర్, హెూశియార్‌పుర్, అమృత్‌సర్ జిల్లాల్లోని పలు గ్రామాలు నీట మునిగాయి. ఈ ఆరు జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

## న్యాయవాద రక్షణ చట్టం అమలు చేయాలని రిలే నిరాహార దీక్ష



తొలి సమయం, ఇల్లందుసెప్టెంబర్, 23.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయ వాదుల రక్షణ కోసం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఇల్లందు కోర్టు ఆవరణలో చేస్తున్న నిరాహార దీక్షల వద్దకు ఇల్లందు బి ఆర్ ఎస్ వ్యవస్థాపక నాయకులు దిండిగాల రాజేందర్, ఎస్. రంగనాథ్, టి బి జి కె ఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, పట్టణ ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ, టి బి జి కె ఎస్ ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్, లలిత్ కుమార్ పాసి లు వెళ్ళి తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ న్యాయవాదులు చట్టాన్ని, న్యాయాన్ని కాపాడటానికి నిలబడుతున్నప్పుడు కొన్ని దుష్ట శక్తులు వారిని టార్గెట్ చేస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నారు. న్యాయ వాదులకు రక్షణ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అందుకే వారి రక్షణకు చట్టం తేవటం మంచిదేనని బి ఆర్ ఎస్ పార్టీ వారి న్యాయమైన పోరాటానికి అండగా ఉంటుందని తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం





తొలి సమయం, ఇల్లందుసెప్టెంబర్, 23. దంత రోగులకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని శ్రీ సాయి అడ్వాన్స్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని అం బజార్ సెంటర్లో శ్రీ సాయి అడ్వాన్స్ డెంటల్ కేర్ ఆసుపత్రి ఐదు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని ఆరవ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దంత వైద్యురాలు డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ రూట్ కెనాల్, లేజర్ ట్రీట్మెంట్ ,ఇన్ ప్లాంట్స్ ,ఫిక్స్ టీత్ , దవడ ఎముకులకు సంబంధించిన సర్జరీలు తదితర చికిత్సలు అందించబడతాయన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఇల్లందులో విజయవంతంగా డెంటల్ కేర్ నిర్వహిస్తున్నామన్నారు. గత 15 సంవత్సరాలుగా తనకు దంత వైద్య విభాగంలో అనుభవం ఉందని , అనేక పరీక్షలు నిర్వహించి రోగులకు సేవలు అందిస్తూ వస్తున్నామన్నారు. ఫీజు కూడా రోగులకు అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని ఇల్లందు, చుట్టూ పరిసర ప్రాంతాల దంత రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రేయ, లేఖన, డాక్టర్ రవి, హరికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి కారోబార్ ను విధుల్లోకి తీసుకోవద్దు



తొలి సమయం నర్సింహులపేట సెప్టెంబర్ 23 :నర్సింహులపేట మండలంలోని నర్సింహపురం బంజర లో గతంలో పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘనుడు,నర్సింహులపేట ఎస్బిఐ బ్రాంచ్ నందు నకిలీ బినామీలతో ఇన్సూరెన్స్ లు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కారోబార్ రామన్నబోయిన వెంకన్న ను విధుల్లోకి తీసుకోవద్దని మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని నర్సింహాపురం బంజర గ్రామానికి చెందిన మారపంగు వీరన్న, భయ్యా మహేష్ లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కపిల్ కు గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ నుండి తొలగించిన కారోబార్ రామన్నబోయిన వెంకన్న కు విధుల్లోకి తీసుకోవాలని వచ్చినట్లు వారు తెలిపారు. ఆర్డర్ జారి కావడంతో గ్రామస్తులు అతనిని విధుల్లోకి తీసుకోవద్దని డిమాండ్ చేశారు. 2022 సెప్టెంబర్ 1న గ్రామానికి చెందిన నకిలీ బినామీల ఇన్సూరెన్స్ లను ఎస్బిఐ బ్రాంచ్ నందు చేశారని ఆరోపించారు. అంతేగాక గ్రామపంచాయతీ సెక్రెటరీ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు వారు పేర్కొన్నారు. 2022 సెప్టెంబర్ 5న కారోబార్ పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేయడంతో గత ఎంపీడీవో సమక్షంలో గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు అతని తొలగిస్తూ తీర్మానం చేశారని గుర్తు చేశారు. అతని తొలగించాక గ్రామంలో ఎలాంటి సమస్యలు లేవన్నారు. అతని విధులకు తీసుకోవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మారపంగు వీరన్న, భయ్యా మహేష్, కట్ల నర్సయ్య, భయ్యా సైదులు, కట్ల సైదులు, కట్ల ప్రశాంత్, గుగులోతు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గ మాత పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామచంద్ర నాయక్



తొలి సమయం మరిపెడ సెప్టెంబర్ 23:మరిపెడ మండల కేంద్రంలోని ప్రసిద్ధ కనకదుర్గమ్మ దేవాలయంలో ఈ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన హెూమాలు, పూజల అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. డాక్టర్ రామచంద్రనాయక్ ఈ ప్రాంత ప్రజల శాంతి, సుఖసంతోషాలు, అభివృద్ధి కోసం ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, అమ్మవారి అనుగ్రహం ఈ ప్రాంతానికి సమృద్ధి, శాంతి తీసుకురావాలని కోరుకుంటున్నాను. ఈ ప్రాంత అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలు ప్రతి గ్రామానికి చేరేలా కృషి చేస్తాను అని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ తరపున ఎమ్మెల్యేకి శాలువా కప్పి ఘన సత్కారం నిర్వహించారు.

# మా ఇంటి స్థలం మాకు ఇప్పించండి మహాప్రభో

## దళితులమైన మమ్మలని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం.



తొలి సమయం, ఇల్లందుసెప్టెంబర్, 23. ఇల్లందు 24 ఏరియా మొండితోగు గ్రామపంచాయతీ, పరిధిలో ఐదుగురి అన్నదమ్ములకు ఉన్నటువంటి స్థలములో. మద్యస్థలాన్ని అనగా రెండు కుంటల స్థలాన్ని దాసరి విజయ తల్లి 2008లో కూతురి కోసం పసుపు కుంకుమల కింద కామ నాగరాజు అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశారు అని వాపోయారు,అప్పటి ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇల్లు రావడంతో.అట్టి స్థలంలో పునాదులు తీసి రెండు గదులకు బేస్మెంట్ నిర్మించుకోవడం జరిగిందని తెలిపారు,ఇట్టి స్థలానికి దారి లేకపోవడంతో మరల కొంత ధనమును కట్టి దారి తీసుకున్నామని.ఆనాటి నుండి అట్టి స్థలాన్ని ప్రతి సంవత్సరం శు భ్రం చేస్తూ వస్తున్నామని.2020 సంవత్సరంలో మాకు తెలియకుండా మా స్థలాన్ని కామ నాగరాజు అనే వ్యక్తి. మరల వేరే వాళ్లకు అమ్మేశారని.మా స్థలంలో ఉన్న రెండు గదుల బేస్మెంట్ ను తొలగించి ప్రహరీ నిర్మాణం చేపడు తున్నారు అని తెలిపారు. ఈ స్థలం మాది అని అడగగా మీ దిక్కున చోట చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నారని ఆడవాళ్ళమైన మమ్మలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. 2020 నుండి ప్రతిసారి స్టేషన్ కి పిలుస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని.ఇట్టి విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.ఎమ్మెల్యే మా వద్ద ఉన్న ఇంటి పత్రాలను పరిశీలించి అతనిని పిలిపించి మాట్లాడారు. అయినాను మా స్థలంలో నిర్మాణాల పనులు మాత్రం ఆగడం లేదంటూ భావాద్దేగానికి లోనయ్యారు. ఆర్థిక స్తోమత వల్ల ఇల్లు కట్టుకోలేకపోతున్నామని. గత 20 ఏళ్లగా అద్దె ఇంటిలోనే ఉంటున్నామని తెలిపారు. మా తమ్ముడికి ఫోన్ చేస్తూ ఆడవాళ్ళ మైన మమ్మల్ని నైట్ పోలీస్ స్టేషన్ కి రమ్మంటూరని తెలిపారు. మమ్మల్ని ఇలానే ఇబ్బందులకు గురి చేస్తే, (హెచ్ఆర్సీ) ఉమెన్ రైట్స్ మానవ హక్కుల కమీషనర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.మా అమ్మమ్మ కష్టించి కొనుగోలు చేసిన మా ఇంటి స్థలాన్ని,మాకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

# రైతులకు అవసరమైన యూరియాను అందించాలి. పత్తి కింటాకు10075 రూపాయలు నిర్మించాలి

## అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఎ ఐ యు కె ఎస్).



తొలి సమయం, ఇల్లందుసెప్టెంబర్, 23. ఈ సీజన్ ఏప్రిల్ నుండి రాష్ట్రానికి రావలసిన యూరియా సరపరలో కేంద్ర ప్రభుత్వం కోతలు విధిస్తూ వచ్చుచున్నది ఈ నెల ఆఖరి వరకు 9.91 లక్షల మెట్రిక్ టన్నుల ఏరియా రాష్ట్రానికి కేంద్రం నుండి రావాల్సి ఉండగా ఏడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. ఇంకా సుమారుగా 3 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉంది పంటలకు చిరు పొట్ట దశలో యూరియా వేయాల్సి ఉంది ఒకవేళ యూరియా అదునులో వేసుకోకుంటే పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది పెట్టిన పెట్టుబడి చేసిన కష్టం వృధా అవుతుంది. రైతులు అప్పుల్లో ఉన్నారు మరింతగా అప్పుల పాలవుతారు అయినా కేంద్ర ప్రభుత్వం సరిపోయినంత యూరియాను సరపరా చేసినామని నమ్మ పలుకుతున్నది రాష్ట్ర ప్రభుత్వం యూరియా డిమాండ్ ను తగ్గిన యూరియా రావడం లేదని మాట్లాడుతున్నది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దోబూలాచెటలో కష్టించి పనిచేసే రైతులు అధోగతి పాలవుతున్నారు తెల్లవారుజామున నుండి ఆగ్రోగ్రోమర్ సెంటర్లు పిఏసిఎస్ రైతు వేదికల ముందు బారులు తీరి రైతులు నిల్చుకొని ఉంటున్నారు అయినా పాలకులకు కనికరం రావడం లేదు ఈ దుర్మార్గాన్ని వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఉంటుంది ఇప్పటికైనా ప్రభుత్వాలు రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో సర్ప ర చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

డిమాండ్లు

.రైతులకు అవసరమైనంత యూరియాను వెంటనే పంపిణీ చేయాలి

..అమెరికా భారత్ పరస్పర వాణిజ్య ఒప్పందాల్లో భాగంగా పత్తిపై ఎత్తివేసిన 11% సుంఖాన్ని పునరుద్ధరించాలి.

.పత్తి పంటకు కనీస మద్దతు ధర రూపాయలు 1075లుగా నిర్ణయించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

.స్వామినాథన్ సిఫరశుల ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు సమగ్ర ఖర్చుల ప్రాతిపదకన కనీస మద్దతు ధరలను %ఎ%2 ప్లస్ 50 అన్ని పంటలను నిర్ణయించాలి.ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

.పోడు భూముల సాగు చేసుకుంటున్నా రైతులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాన్ని ఆపాలి. పోడు సాగుదారుల అందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా పూర్తిస్థాయి హక్కు పత్రాలు ఇవ్వాలి.

.ప్రకృతి వైపరీత్యాల అతివృష్టి వరదల వలన నష్టపోయిన రైతులకు ఎకరాకు 50వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి.

.పంటలన్నిటికీ పసల్ బీమా యోజన వర్తింప చేయాలి బీమా ప్రీమియం ప్రభుత్వమే భరించాలి.

ఈ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇల్లందు తాసిల్దార్ గారికి సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు ఆర్ బోస్, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న, డివిజన్ కార్యదర్శి శ్రీ రామ్ కోటయ్య, మండల అధ్యక్షులు జూకంటి గాంధీ ,బుర్ర రాఘవులు,చాందావత్ బాలు, బుర్ర లక్ష్మయ్య, గుర్రం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు మనుగడకై సెప్టెంబర్ 25న జిఎం కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయండి.

## జి ఎల్ బి కే స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే. సీతారామయ్య



తొలి సమయం, ఇల్లందుసెప్టెంబర్, 23.సింగరేణి సిరులకు పుట్టినిల్లు బొగ్గుట్ట (ఇల్లెందు)మనుగడకై సెప్టెంబర్ 25న జిఎం కార్యాలయం ముందు ఐ ఎఫ్ టి యు నిర్వహించే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం(జి ఎల్ బి కే స్)రాష్ట్ర ప్రధానకార్యదర్శి జే.సీతారామయ్య పిలుపునిచ్చారు.

మంగళవారం ఇల్లెందు జెకె 5 ఓసి లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఇల్లెందు ప్రాంతంలో అపారమైన బొగ్గునిక్షేపాలు ఉన్నప్పటికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యం పట్టించుకోకుండా బొగ్గుట్టను బొందలగడ్డగా మారుస్తున్నారని విమర్శించారు.జెకె 5 ఓసిలో 70వేల టన్నుల బొగ్గు ఉందని ఇంకా రెండు సంవత్సరాలు నడిపించే అవకాశాలున్నాయని అన్నారు.ఇల్లందు ఏరియాలో నూతన బొగ్గు బావులు తీయాలని సింగరేణి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. పూసపల్లి ఓసినీ10 నుండి15సంవత్సరాలు నడిపించవచ్చని, నిర్వాసితులకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఇల్లందు మనుగడకై కలిసొచ్చే సంఘాలను కలుపుకొని పోరాడుతామని అన్నారు.జి ఎల్ బి కే ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాపు కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి,సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎస్ సి సి డబ్ల్యూ యు)రాష్ట్ర అధ్యక్షులు ఎండి. రాసుద్దిన్,ఐ ఎఫ్ టి యు ఇల్లెందు ఏరియా కమిటీ అధ్యక్ష అధ్యక్ష,కార్యదర్శులు రావూరి ఉపేందర్ రావు, డి.మోహన్ రావు కార్మికులు పాల్గొన్నారు.

## వైభవంగా రెండవ రోజు గాయత్రి మాత అవతారం







తొలి సమయం పెబ్బేరు సెప్టెంబర్ 23 పెబ్బేరు మండలంలోని శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో పెబ్బేరు తొగటవీర క్షత్రియుల సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవంలో భాగంగా రెండవ రోజు సకల విద్యలకు ఆదిదేవత శ్రీ గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు మనకు దర్శనమిచ్చారు.ఇట్టి పూజా కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు పెద్దికోట్ల ఈశ్వరయ్య దంపతులు,బలుపాల సుధాకర్ దంపతులు,బలపాల రమేష్ దంపతుల, రంగం అజయ్ దంపతులు,రంగం మధు దంపతులు ఇ పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది ఇట్టి పూజా కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకు శ్రీ గాయత్రీ దేవి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కమిటీ తరఫున కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో తోగుట వీర క్షత్రియ సేవా సంఘం సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

### సెప్టెంబర్ 24 కొత్తగూడెంలో జరిగే మహా ర్యాలీని విజయవంతంచేయాలి ఏఎస్పీ పిలుపు.



అల్లపల్లి సెప్టెంబర్ 23 (తొలి సమయం) ఈరోజు గుండాల మండలం నడింగూడెం గ్రామంలో విస్తృత ప్రచారంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ గుండాల మండలం కార్యదర్శిని జబ్బ సుదర్శన్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 24 కొత్తగూడెంలో ఎస్టీ జాబితా నుండి లంబాడాలని తొలగించాలని క్విట్ ఆదివాసి మహా ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చి నడింగుడెం గ్రామంలో మాట్లాడుతూ, రాజ్యాంగ విరుద్ధంగా పార్లమెంట్ ఎటువంటి తీర్మానాలు జరగకుండా ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా దొడ్డి దారిన ఎస్టీ జాబితాలో చేరి నిజమైన ఆదివాసులకు అన్యాయం జరుగుతుందని దొడ్డి దారిన వచ్చిన వలస లంబాడీల వల్ల విద్యా ఉద్యోగం 29 శాఖాలలో మాకు నష్టం జరుగుతుందని వాపోయారు, అదేవిధంగా గ్రామ పెద్దలు యువత భారీ ఎత్తున పాల్గొని కొత్తగూడెంలో జరిగే క్విట్ ఆదివాసి మహా ర్యాలీలో పాల్గొంటామని సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగింది, ఈ కార్యక్రమంలో జబ్బా శ్రావణ్ సురేష్ నాగేష్ జబ్బ సుమన్ రాజబాబు జోగయ్య పోతయ్య నవదీప్ సుశాంత్ చంద్రయ్య లలిత సావిత్రి శేఖర్ శ్రావణ్ పవన్ వర్మ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### డిష్ వైరు మరమ్మతులకు వెళ్లి వ్యక్తి గల్లంతు



తొలి సమయం పెద్ద వంగర సెప్టెంబర్ 23పెద్ద వంగర మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన కమ్మగాని అశోక్ ఈరోజు ఉదయం 9 గంటల సమయంలో ఇంటి నుండి వెళ్లి గంట్లకుంట గ్రామంలోని కుంటలో ఉన్న స్తంభానికి డిష్ వైర్ మరమ్మతుల కోసం చెరువులో వెళ్ళాడు కొద్దిసేపటి తర్వాత చెరువులో మునుగుతూ తేలుతూ గల్లంతయ్యాడు అనే కేబుల్ టీవీ టెక్నీషియన్ పెరుమాండ్ల శ్రీనివాసు తండ్రి బుజ్జి రాములు చెప్పినాడు ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ పెద్ద వంగర లో ఫిర్యాదు చేయడం జరిగింది ఫిర్యాదు నిమిత్తం మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు మొదలు పెట్టినారు అతని వయసు 35 తండ్రి రాములు కేబుల్ ఆపరేటర్ కింద సహాయకుడిగా పనిచేసేవాడు కట్ట అయినదని రిపేరు చేయడానికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లడం జరిగింది. ఆ సమయంలో సదర్ వ్యక్తి ఇంటికి ఫోన్ చేసి విషయం తెలుపగా వెంటనే అక్కడికి చేరుకున్న భార్య కమ్మగానే కనక తార కు నీటిలో మునిగిపోయాడు అని చెప్పారు కావున నా భర్త ఆచూకీ తెలిపి నాకు అప్పజెప్పగలరని ఫిర్యాదు చేశారు స్థానిక ఎస్ఐ మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు మొదలుపెట్టినారు పూర్తి వివరాలు తెలవాల్సి ఉంది

## అన్నం పెట్టే రైతుకు బస్తా యూరియా ఇవ్వలేని పాలకులు

తొలి సమయం, వనపర్తిసెప్టెంబర్, 23.
అన్నం పెట్టే రైతుకు బస్తా యూరియా ఇవ్వలేని పాలకులు దేశాన్ని ఏలటం రైతుల దురదృష్టకరమని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ విమర్శించారు. మంగళవారం జిల్లాలో యూరియా కొరతకు నిరసనగా వనపర్తి ఎమ్మార్వో ఆఫీస్ ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతుకు యూరియా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్వో రమేష్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు పృథ్వీనాదం అధ్యక్షతన జరిగిన సభ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే అన్నారు. తెలంగాణ అడిగిన యూరియా ఇచ్చి ఉంటే రైతులకుఇన్ని కష్టాలు వచ్చేవి కావన్నారు. వరి పంటకు రెండో విడత యూరియా వేసే సమయం దాటి పోతోందన్నారు. సకాలంలో వేయకపోతే దిగుబడి తగ్గుతుందన్నారు.. రైతులు ఉచితంగా యూరియా ఇమ్మనటం




లేదనిడబ్బులు పట్టుకొని క్యూలో ఉదయం నుంచి రాత్రి వరకు నిలబడ్డా ఇవ్వకపోవడం కేంద్రపాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు. సుమారు 45 రోజుల నుంచి పిఎసిఎస్ లు, ప్రైవేట్ డీలర్ల వద్ద బస్తా యూరియా కోసం క్యూ లైన్ లో పనులు వదులుకొని తిండి తిప్పలు లేకుండా పంపిణీ కేంద్రాల చుట్టూ రైతులు తిరుగుతున్నారన్నారు. కేంద్రం తెలంగాణ జిల్లాలో గణపురం గోపాల్పేట అమరచింత ఆత్మకూరు పానగల్లు అన్నిచోట్ల రైతులు రోడ్ ఎక్కుతున్నా పాలకుల్లో చలనం లేదన్నారు. టోకెన్లు ఇచ్చిన 15 రోజులకు కూడా యూరియా ఇవ్వటం లేదన్నారు. ఇదిగో వస్తుంది అదిగో వస్తుందని చెప్పడం తప్ప యూరియా పూర్తిస్థాయిలో రైతులకు అందించింది లేదన్నారు. యూరియా కొరత తీర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జే. చంద్రయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వీనాదం, వనపర్తి పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, మాజీ సహాయ కార్యదర్శి ఎర్రకురుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్,ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్ శిరీష, వంశీ, జ్యోతి, సుప్రియ, బాలస్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన హాస్టల్ వర్కర్స్ సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

### కాలయాపన చేస్తే జరిగే పరిణామలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి.

### సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మచ్చా వెంకటేశ్వర్లు.

తొలి సమయం, ఇల్లందుసెప్టెంబర్, 23.
ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్, పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ల లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు,ఔట్సోర్సింగ్ కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం గత 12 రోజులుగా జరుగుతున్న సమ్మె లో భాగంగా నేడు జరిగిన సమ్మె శిబిరం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్య ను వెంటనే పరిష్కరించాలని



అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ డైలీ వేజ్ వర్కర్లకు ఇస్తున్న 26700/వేతనం 11700కు తగ్గించారని, ఇది పాతపద్ధతి లో కొనసాగించాలని,కార్మికులను పర్మినెంట్ చేయాలని టైమ్ స్కేల్ అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ వర్కర్లకు 15600 వేతనం ఇవ్వాలని 10నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల సమ్మె మరింత ఉధృతం చేస్తామని జేఏసీ, సీఐటీయూ అల్లిమేటం ఇల్లందు లోని అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ నిరవధిక సమ్మె లో ఉన్నాయి.ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ డైలీ వేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ తో వెట్టి చాకిరీ చేయిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమం లో సంఘిభావంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీను, హాస్టల్ డైలివేజ్ ఔట్ సోర్సింగ్ రాష్ట్ర కార్యదర్శి సిఐటీయు బీ మధు జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, సిపిఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు వజ్జా సురేష్, సీఐటీయూ మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ.హాస్టల్ డైలివేజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్ల జే ఏ సీ నాయకులు భద్రయ్య, ముత్తయ్య నాగేశ్వరరావు, స్వామి, మంగ,లక్ష్మణ్,పాపారావు,రఘు,జయ,రామకల,లాలయ్య,రాజు,నాగులు, ఈ స్వరూప,అంజమ్మ,దీప, సుధ సుబ్రమణ్యం,వినయ్, అనిత విజయభారతి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వ జాప్యం

### సిపియం కు సంఘీభావం తెలిపిన - మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొలి సమయం తొర్రూరు సెప్టెంబర్ 23తొర్రూరు మండల కేంద్రంలో గత ప్రభుత్వంలో నిర్మించిన దాదాపు 260డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ లో నిర్మాణం చేసి పంచుటకు సిద్ధం ఉండే టైంలో ఎన్నికల నోటిఫికేషన్ రావటం వలన ఇవ్వలేక పోవడం జరిగింది.అప్పటినుంచి ఇప్పటివరకు సుమారుగా 22 నెలలు అయింది కాంగ్రెస్ ప్రభుత్వం లోకి వచ్చి అయినా ఇప్పటివరకు



లబ్ధిదారులకు అందించకపోవడం
డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి నిర్లక్ష్య ధోరణికి నేడు సిపియం పార్టీ ఆధ్వర్యంలో తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఆందోళన కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
ఈ కార్యక్రమంలో జిల్లా ,మండల ,తొర్రూరు పట్టణ మరియు మండల కేంద్రానికి చెందిన వివిధ గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు సిపియం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు....

## పంచాయతీరాజ్ శాఖ సమీక్షా సమావేశం

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమీక్షా సమావేశం

తొలి సమయం పాలకుర్తి సెప్టెంబర్ 23పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి అధ్యక్షత వహించారు..
ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల, మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ,



భవన నిర్మాణాలు వంటి ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు..
ప్రభుత్వం కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని వారు ఆదేశించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడానికి అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పనులలో జాప్యం, నిర్లక్ష్యం చోటు చేసుకోరాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు..
అలాగే, అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఈ.ఈ. శ్రీనివాస్ రావు, డి.ఇ. రామలింగ చారి, స్పెషల్ ఏ.ఈ. శ్రీనివాస్, ఏ.ఈ. రాహుల్, ఏ.ఈ. మహేష్ తదితర పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు..

## ఎస్సై శ్రీకాంత్ ను వెంటనే సస్పెండ్ చేయాలి



### హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్

### నిరుపేద మహిళలకు న్యాయం చేయాలి రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర సెక్రెటరీ సంజీవరావు

తొలి సమయం డెస్క్ హైదరాబాద్ సెప్టెంబర్ 23 :మరియమ్మ దళిత మహిళ అనే విచక్షణను కోల్పోయి ఆమె పై దౌర్జన్యంగా భౌతిక దాడికి పాల్పడిన ఎస్సై శ్రీకాంత్ను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీ ని కోరారు మంగళవారం బషీర్బాగులో వివిధ



సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో హ్యూమన్ రైట్స్ జాతీయాధ్యక్షులు డాక్టర్ మంగళపెల్లి హుస్సేన్ మాట్లాడుతూ. వరంగల్ జిల్లా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్ ఆగస్టు 22వ తారీకు పోలీస్ స్టేషన్ సమీపాన ఉన్న రెడ్ బకెట్ మరియమ్మ ఉపాధి కోసం జీవనోపాధి కోసం. బిర్యానీ హోటల్ నడుపుకుంటున్న సమయంలో అనేకసార్లు ఉచితంగా బిర్యానీ పార్సల్ చేయడం జరిగింది, అన్నారు ఒకసారి ఇవ్వకపోవడంతో రాత్రి సమయంలో బందు చేసి పాత్రలు శుభ్రం చేస్తున్న సమయం లో ఆకస్మితంగా వచ్చి గ్యాస్ కనెక్షన్ తీసాడని, ఆసమయంలో అడ్డువచ్చిన వృద్ధురాలు అయిన మహిళ మరియమ్మను చేయి చేసుకుని బలవంతంగా కొట్టాడు.అని ఆరోపించారు. అడ్డు వచ్చి నా కుమారుడు శేఖర్ ను కూడా సభ్యకరమైన పదజాలంతో వాడి అతని కొట్టడం దారుణమని ప్రశ్నించారు అన్నారు వెంటనే సిపి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి వరంగల్ ఎంపీ మినిస్టర్ సిపి ఆదేశాలు జారీ చేసి ఎస్సైను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల సంజీవరావు. ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ కందికొండ. రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్య వినోద్ కుమార్. హైదరాబాద్ ఇన్చార్జి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దవంగర మండలంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్...

### బీఆర్ఎస్ తొర్రూరు పార్టీ ఆఫీసులో లో చేరికలతో కాంగ్రెస్ కుదేలు

తొలి సమయం తొర్రూరు సెప్టెంబర్ 23పెద్ద వంగర మండలంలో డీలా పడుతున్న కాంగ్రెస్ ఉప్పరగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంతల వెంకట్ రెడ్డి,పెంతల సంజీవ రెడ్డి,నానాబాల మల్లయ్య,నానాబాల సోమయ్య,యండి చంద్ పాషా, ధర్మరపు సాంబరాజు,ఓరుగటి సోమయ్య,పాశం మైసయ్య, గద్దల యాకయ్య, గద్దల కొమరయ్య, గద్దల వెంకటయ్య, గద్దల అంజయ్య,దుంపల రాము,దుంపల కొమురయ్య,ఓరుగంటి వీరయ్య,పెద్ది యాకయ్య,ఏనుగటి ముత్తయ్య,యాకయ్య తదితరులు బీఆర్ఎస్ పార్టీ లో చేరగా గులాబీ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు




మాట్లాడుతూఈ సమయంలో అధికార పార్టీ నుండి మన పార్టీ చేరుతున్నారంటేనె అర్థం చేసుకోవాలి ఈ ప్రభుత్వ పనితనం ఎంత ఉందో..పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కష్టపడాల్సిన అవసరం ఉంది.గడపగడపకు మన కార్యకర్త తిరిగి ఈ బోగస్ ప్రభుత్వం చేసిన బోగస్ హామీలను వాళ్లకు అర్థమయ్యే రీతిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బోగస్ 420 హామీల వల్ల ప్రజలు మోసపోయారుకాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అరిగోసలు పడుతున్నారు,రాష్ట్రంలో మొత్తం రాక్షస పాలన కొనసాగుతుంది.. సరైన పాలన లేదన్నారు స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వేలన్నీ బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నాయన్నారు.పార్టీ క్యాడర్ , యూత్ సోషల్ మీడియా నాయకులు ఈ ఎన్నికల్లో కష్టపడి పని చేసి మన సత్తాచాటాలి.
ప్రజలు , నిరుద్యోగ విద్యార్థులు, ఎన్నికల కోసం వేచి చూస్తున్నారు. ప్రజలు రేవంత్ రెడ్డి పాలనలో చాలా అసమ్మతితో ఉన్నారని వ్యక్తం చేశారు.సర్వేలన్నీ మన వైపే ఉన్నాయి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 90% బీఆర్ఎస్ పార్టీ గెలుపొందుతామన్నారు.
ఈ కార్యక్రమం లో మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దిన పత్రిక
తొలి సమయం
బుధవారం 24 సెప్టెంబర్ 2025

# మహేంద్రజాలం చూడాల్సిందే!







తూర్పుకనుమల్లో అందాలు నెలకొన్న కొండలు మహేంద్రగిరులు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో పర్వత శ్రేణులపై ప్రకృతి ఎప్పుడూ పరవశిస్తూ ఉంటుంది. చెట్లు, చేమలతో పచ్చలపేరులా మెరిసిపోతున్న మహేంద్రగిరుల్లో.. అక్కడక్కడా వజ్రాలు పొదిగినట్టుగా అపురూప ఆలయాలు దర్శనమిస్తాయి. ముత్యాలు కుమ్మరించినట్టుగా నీటి చెలమలు కనిపిస్తాయి. ఈ గిరులకు ఏడాదంతా పర్యాటకుల తాకిడి ఉంటుంది. ముఖ్యంగా శివరాత్రి సందర్భంగా వేల మంది భక్తులు తరలి వస్తారు. ఇక్కడి పాండవుల ఆలయాలను సందర్శిస్తారు. ఆ చుట్టుపక్కల వాళ్లు ప్రతిష్ఠించిన మహాలింగాలను భక్తితో పూజిస్తారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం సింగుపురం సమీపంలో ఉంటాయి మహేంద్రగిరులు. సముద్ర మట్టానికి ఐదువేల అడుగుల ఎత్తులో ఉన్నాయివి. అరుదైన వృక్షసంపద వీటి సొంతం. వనవాసకాలంలో పాండవులు మహేంద్రగిరులపై కొంతకాలం గడిపారని చెబుతారు. ఆ సమయంలో ఒక్కొక్కరూ ఒక్కో మందిరాన్ని నిర్మించుకొన్నారని స్థానిక కథనం.

అందుకు తగ్గట్టుగా ఇప్పుడు అక్కడ పాండవుల పేరిట ఆలయాలు కనిపిస్తాయి. ధర్మరాజు, కుంతీదేవి ఆలయాలు ఒక ప్రదేశంలో ఉండగా.. భీమసేనుడి ఆలయం ఎత్తయిన శిఖరంపై కనిపిస్తుంది. అక్కడికి కొంత దూరంలో అర్జునుడు, నకుల, సహాదేవుల ఆలయాలు ఉన్నాయి. వీటి పరిసర ప్రాంతాల్లో పాండవులు ప్రతిష్ఠించారని భావించే లింగాలు కనిపిస్తాయి. కాలప్రవాహంలో ఆలయాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. అయినా.. వాటి ప్రాశస్త్యం మాత్రం తగ్గలేదు. ఏటా శివరాత్రి సందర్భంగా మహేంద్రగిరులపై జరిగే ఉత్సవాలకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు వస్తుంటారు. పిల్లలు, పెద్దలు వ్యయప్రయాసలకోర్చి సాహసయాత్రకు పూనుకుంటారు. శివరాత్రికి ఒకరోజు ముందుగానే భక్తులంతా గిరులపైకి చేరుకుంటారు. పూజాసామగ్రి, మంచినీళ్లు, ఆహారం, పళ్లు అన్నీ వెంట తెచ్చుకుంటారు. శివరాత్రి ఉపవాస దీక్షలో ఉంటారు. భజనలతో రాత్రంతా జాగరణ చేస్తారు. మర్నాడు భోజనాలు చేసుకొని తిరుగు ప్రయాణం అవుతారు.

శివరాత్రి సందర్భంగా జనంతో కిటకిటలాడే మహేంద్రగిరులు ఆ తర్వాత బోసిపోతాయి. సాహస యాత్రికులు మాత్రం తరచూ ఇక్కడికి వస్తుంటారు.


ఇలా వెళ్లాలి.. మహేంద్రగిరుల యాత్రకు సాహసంతో పాటు ఓపిక కూడా ఉండాలి. ముందుగా శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నుంచి బస్సుల్లో మందస మండలం సింగుపురం చేరుకోవాలి. మహేంద్రగిరులకు సమీపంలో ఉన్న రైల్వే స్టేషన్ పలాస. ఇక్కడి నుంచి మందస మీదుగా సింగుపురం చేరుకోవచ్చు. బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి. సింగుపురం నుంచి వాహనాల్లో.. చొంపాపురం మీదుగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామమైన రాజబసకు వెళ్లాలి. ఆపై కాలినడక మొదలవుతుంది. దాదాపు 28 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది.

# మమ్మీలను చూసొచ్చాం..!

**గీజా పిరమిడ్‌లో...**

గ్రేట్ పిరమిడ్‌కు రెండు ద్వారాలు ఉన్నాయి. ఒకటి ఫారో చక్రవర్తి కోసమైతే, రెండోది ప్రజలకోసమట. సందర్శకులను ఒక ద్వారం నుంచే అనుమతిస్తున్నారు. లోపలకు వెళ్లి కింగ్స్ ఛాంబర్‌ను చూశాం. దీంట్లోనే కూఫూ తనకోసం నిర్మించుకున్న సమాధి ఉంది. ప్రస్తుతం నాలుగు పిరమిడ్లను మాత్రమే సందర్శకులకు అనుమతిస్తున్నారు. ఒక్కో పిరమిడ్ వెనక మూడు చిన్న పిరమిడ్లను రాణులకోసం నిర్మించారు. అవి చూశాక దగ్గర్లోనే ఉన్న వ్యాలీ ఆఫ్ నైలులోని స్ఫింక్స్ చూద్దానికి వెళ్లాం. మనిషి మొహం, సింహం శరీరం గల పౌరాణిక రూపమే స్ఫింక్స్. ఒక సున్నపురాతి కొండనే ఆ విధంగా మలిచారట. ఆ ముఖం ఫారో కాఫ్రాది అని చెబుతారు. దీన్ని క్రీ.పూ. 2613- 2494లో నిర్మించినట్లు తెలుస్తోంది.





తరవాత మజిలీ ఈజిప్టు మ్యూజియం... అందులో 1,20,000కి పైగా పురాతన వస్తువులూ 12 మమ్మీలూ ఉన్నాయి. దీన్ని 1902లో నిర్మించారట. 2011లో ఈజిప్టులో జరిగిన తిరుగుబాటులో కొన్ని విగ్రహాలనూ రెండు మమ్మీలనూ ఆందోళనకారులు ధ్వంసం చేశారట. ఇందులో ప్రధానంగా చూడదగ్గది టూటన్‌కామెన్ మమ్మీని ఉంచిన బంగారు శవపేటిక. ఇది ప్రపంచంలోకెల్లా ఖరీదైన శవపేటికగా పేరొందింది. అప్పట్లో ఆయన ముఖానికి 14 కిలోల బంగారు తొడుగు తొడిగారు. ఆయనకోసం చేయించిన బంగారు మంచం, కుర్చీ, నగలు కూడా అక్కడ ఉన్నాయి. తరవాతిరోజు కైరోలోని ఒక మార్కెట్‌ని సందర్శించాం. ఈజిప్షియన్లలో అత్యధికులు ముస్లింలే. ముఖ్య భాష అరబ్బీ. కైరోలో చాలావరకూ ఇండ్లకు ప్లాస్టరింగ్ చేయడం తక్కువ. అక్కడ వర్షపాతం చాలా తక్కువ. దాంతో ముందు మాత్రమే చేస్తారట.




**ఆస్వాన్ నగరంలో...**

మర్నాడు ఆస్వాన్ సిటీకి బయలుదేరాం. ఆస్వాన్‌లో ఆనకట్టను 'హై డ్యామ్' అని పిలుస్తారు. ఈ నిర్మాణంవల్ల లోతట్టు ప్రాంతం ముంపునకు గురైంది. అందులో ఆస్వాన్ ఆలయం, ఫిలై ఆలయం, ఆబుసింబల్ ముఖ్యమైనవి. అయితే యునెస్కో సహకారంతో వాటిని ఎత్తైన ప్రదేశాలకు తరలించారు. ఈ చుట్టుపక్కల న్యూబియన్ అనే పురాతన తెగ ఉన్న గ్రామం కూడా ముంపునకు గురయింది. వారి భాష న్యూబియన్. దీనికి లిపి లేదు. వారికి తప్ప ఎంత ప్రయత్నించినా వేరే ఎవరూ ఆ భాష నేర్చుకోలేరని తెలిపాడు గైడ్. వాళ్లను అత్యంత ప్రాచీన ఈజిప్షియన్లుగా చెప్పవచ్చు.

మరబోటులో వెళ్లి ఫిలై ఆలయాన్ని సందర్శించాం. ఇందులోని దేవత పేరు ఐసిస్. ప్రాచీన ఈజిప్షియన్లు నిర్మించిన చిట్టచివరి ఆలయం ఇదేనట. దీన్ని వాళ్లు దేవతలుగా ఆరాధించే ఓజిరిస్, ఐసిస్‌లు పుట్టిన ప్రదేశంగా విశ్వసిస్తారు. కాలక్రమంలో క్రిస్టియన్లు దీన్ని చర్చిగానూ ఉపయోగించారు. పురాతన ఈజిప్షియన్లు తాము ఆరాధించే దేవతలని మానవరూపంలో కాకుండా జంతురూపంలోనే ఎక్కువగా పూజించేవారు. అందుకే ఆలయగోడలమీద ఎద్దు, గద్ద, నక్క, మొసలి రూపంలో మలిచిన విగ్రహాలన్నీ ఆ కోవకే చెందుతాయి. నైలునదిలో ఆస్వాన్ నుంచి లక్సర్‌కు పడవలో బయలుదేరాం. దారిలో పిరమిడ్లకోసం తవ్విన గ్రానైట్ క్వారీనీ, అసంపూర్తిగా వదిలేసిన ఓబిలిస్క్‌నీ చూశాం. ప్రాచీన ఈజిప్షియన్లు ఒంటిరాయి స్తంభాలను నిర్మించి వాటిమీద రాజుల గురించి చెక్కించేవారు. నైలునది దక్షిణం నుంచి ఉత్తరానికి 6,853 కిలోమీటర్లు ప్రవహించి, రెండు పాయలుగా చీలి మధ్యధరా సముద్రంలో కలుస్తుంది. ఈజిప్టు మొత్తం నైలునది మీదే ఆధారపడి ఉందంటే అతిశయోక్తి కాదు. అందుకే అక్కడివాళ్లంతా 'నో నైల్, నో ఈజిప్ట్' అంటుంటారు. ఎక్కడో చిన్న చిన్న పాయలుగా మొదలైన నైలు నది ఈజిప్టుకే వరప్రదాయని అని చెప్పవచ్చు. పడవలో సాయంత్రం ఆరు గంటలకు కొమాంబు ఆలయానికి చేరుకున్నాం. ఈ ఆలయాన్ని మొసళ్ల దేవతకోసం నిర్మించారు. 22 మొసళ్లనూ గుడ్లనూ మమ్మీలుగా చేసి ప్రదర్శిస్తున్నారు.


మర్నాడు ఉదయం నాలుగు గంటలకు ఆబుసింబల్ దర్శించడానికి బయలుదేరాం. 300 కి.మీ. దూరం సహారా ఎడారిలోనే ప్రయాణం. దారిలో ఒక్క ఊరు కూడా కనబడదు. గొప్ప ఫారో చక్రవర్తిగా పేరొందిన రామ్‌సీస్ ఖీఖీ నిర్మించినదే ఆబుసింబల్ ఆలయం. ఆనకట్ట కారణంగా ముంపునకు గురవడంతో దీన్ని ఇక్కడకు తరలించారు. ఇది రెండు ఆలయాల సముదాయం. ఒకటి రామ్‌సీస్ కోసమైతే, రెండోది ఆయన భార్య నెఫెర్‌టారికోసం. ఇది ఒకటే రాతితో నిర్మించిన భారీ విగ్రహాల సముదాయం. ఆ అద్భుత శిల్పకళా సంపదను దర్శించి, తిరిగి ఓడ దగ్గరకు వచ్చేసరికి మధ్యాహ్నం రెండు గంటలయింది. అక్కడినుంచి ఓడలోనే ఎడ్ఫుకి చేరుకున్నాం. ఉదయం ఏడు గంటలకు గుర్రపుబగ్గీలో ఎడ్ఫు ఆలయానికి చేరుకున్నాం. గద్ద ముఖం, మనిషి శరీరంతో గల హోరస్ దేవతకు చెందిన ఆలయం ఇది.ఇక్కడి ఆలయాలన్నీ ముందు భాగం వెడల్పుగానూ ఎత్తుగానూ లోపలికి వెళ్లే కొద్దీ వెడల్పూ ఎత్తూ తగ్గుతూ ఉంటాయి. ఇక్కడ ఉన్న భారీ కుడ్యాలనూ స్తంభాలను చూస్తే ఔరా అనిపించక మానదు. గోడలమీద అప్పట్లోనే ఆపరేషన్లకు అవసరమైన వస్తు సామగ్రినీ కాన్పు సమయంలో తల్లిని కూర్చోబెట్టిన దృశ్యాలనూ చెక్కడం చూసి ఆశ్చర్యపోయాం. చివరి రోజు లక్సర్ పట్టణాన్ని సందర్శించాం. ఇది ఫారోల రాజధాని నగరం. ఇక్కడ ముఖ్యంగా చూడదగ్గవి నాలుగు. మార్చురీ టెంపుల్ ఆఫ్ హాట్సెప్పుట్, కార్నక్ టెంపుల్, వ్యాలీ ఆఫ్ కింగ్స్, లక్సర్ ఆలయాలు. హాట్సెప్సుట్ టెంపుల్ ఓ సూర్యదేవాలయం. ఈ ప్రదేశంలో దొరికిన శిథిలాలతో దీన్ని పునర్నిర్మించారు. ఇందులోని వర్ణచిత్రాలను చూసి ఆశ్చర్యపోవాల్సిందే. వేల సంవత్సరాలు గడిచినా ఎండకు ఎండినా రంగులు మాత్రం వెలసిపోలేదు. అక్కడి నుంచి వ్యాలీ ఆఫ్ కింగ్స్‌కు బయలుదేరాం.



**సమాధుల్లో మమ్మీలతో..!**

ఈజిప్టుని పాలించిన ఫారో చక్రవర్తులు మరణానంతర జీవితం ఉంటుందని విశ్వసించేవారు. అందుకోసమే భారీ యెత్తున పిరమిడ్లు నిర్మించుకున్నారు. క్రీ.పూ. 1069 నాటికి క్రమంగా వాటిమీద ఇష్టం తగ్గి, సమాధులు నిర్మించుకోవడం ప్రారంభించారు. పిరమిడ్‌లలో ఉంచిన మమ్మీలనూ సంపదలనూ దుండగులు కొల్లగొడుతుండటం కూడా ఒక కారణం కావచ్చు. దాంతో తమ సమాధులను భద్రంగా ఉండేందుకు ఈ వ్యాలీ ఆఫ్ కింగ్స్‌ను ఎన్నుకున్నారు. ఈ భూభాగమే సహజసిద్ధంగా ఏర్పడిన పిరమిడ్ ఆకారంలో ఉంటుంది. దాంతో తరవాతి కాలానికి చెందిన ఫారోలు తాము జీవించి ఉండగానే తమ అభిరుచికి అనుగుణంగా తమ సమాధులని ఇక్కడ తీర్చిదిద్దుకున్నారు. అలాంటివాటిల్లో టూటన్‌కామెన్ సమాధి ఒకటి. కైరో మ్యూజియంలోని మమ్మీలన్నీ ఇక్కడ బయటపడినవే. ప్రస్తుతం ఈ వ్యాలీలో కేవలం మూడింటిలోకే ప్రవేశం ఉంది. భూమిలోపలి పొరల్లో గుహలుగా తొలిచి మరీ వీటిని నిర్మించారు. అద్భుత కుడ్యచిత్రాలతో కూడిన టూటన్‌కామెన్ సమాధిలో అతని మమ్మీని సందర్శించాం. ఆ సమాధిలో అనేక వస్తువులతోబాటు బంగారు తొడుగూ టూటన్‌కామెన్ మమ్మీ బయటపడ్డాయట. మమ్మీనీ, చెక్క శవపేటికనీ ఇక్కడ సందర్శనకు ఉంచి మిగిలిన సంపదను కైరో మ్యూజియంకు తరలించారు. చివరగా లక్సర్ ఆలయానికి వెళ్లాం. ఇది 66 ఎకరాల్లో నిర్మించిన 132 భారీ స్తంభాల సముదాయం. ఇక్కడ రహదారికి ఇరువైపులా మానవశరీరం పొట్టేలు ముఖం కలిగిన విగ్రహాలున్నాయి. పిరమిడ్లతోబాటు ఈజిప్షియన్ల కళాసంపదనీ చూశామన్న తృప్తితో వెనుదిరిగాం.

**వానాకాలం విహారం మనసుకు ఆహ్లాదాన్నిస్తుంది. ప్రయాణంలో కొన్ని చికాకులు ఉన్నా.. చల్లటి వాతావరణం, పచ్చదనంతో పులకించే పుడమి, జలకళ సంతరించుకున్న నదీనదాలు ఇవన్నీ మాన్‌సూన్ పర్యాటకానికి కిక్ ఇచ్చేవే. వానకాలం ప్రయాణాల్లో ఈ జాగ్రత్తలు పాటిస్తే సాధారణ సమస్యల నుంచి సులభంగా బయటపడొచ్చు.**



# వానల్లో వెళ్తున్నారా..

వర్షాకాలం దోమల బెడద నుంచి తప్పించుకోవాలంటే రెప్పలెంట్ దగ్గరుంచుకోవాలి. రెప్పలెంట్ బాండ్స్ కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి.

ఎక్కడపడితే అక్కడ నీళ్లు తాగడం మంచిది కాదు. మినరల్ వాటర్ తాగండి. అవకాశం ఉంటే నీటిని కాచి వడగట్టండి.

రెయిన్ కోట్, గొడుగు వెంట తీసుకెళ్లండి.

వర్షాకాలం విహారంలో ఎక్కువగా ఆకర్షించేవి చిరుతిళ్లు. చిరుజల్లుల వేళ.. వేడివేడిగా ఏది కనిపించినా తినకుండా ఉండలేం. శుభ్రత పాటించని ఫుడ్‌కోర్టుల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చిరుతిళ్లు తింటే.. ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది.

వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. వర్షపాతం వివరాలు, పర్యటించదలచిన ప్రాంతంలో పరిస్థితులు వీటి గురించి అంతర్జాలంలో సమాచారం సేకరించి అందుకు తగ్గట్టుగా ప్రయాణ ప్రణాళిక మార్చుకోవాలి.



# ఐస్‌కేఫ్.. కెవ్వుకేక!

ప్రకృతిలో చాలా అందాలున్నాయి. అద్భుతాలున్నాయి. కొన్నింటిని మనిషి సృష్టిస్తే కొన్నింటిని మాత్రం ప్రకృతి ఇచ్చింది. అలా ప్రకృతి ఇచ్చినవి ఎప్పటికీ అద్భుతంగానే ఉంటాయి. భారతదేశంలో ఉన్న ఏకైక ఐస్‌కేఫ్ ఇది. అయితే ప్రకృతిసిద్ధంగా లడఖ్‌లో ఉద్భవించింది. సముద్రమట్టానికి 14వేల అడుగుల ఎత్తులో ఉన్నది. మనాలి -లే హైవే ఈ కేఫ్ కనిపిస్తుంది. దీన్ని మానవులు సృష్టించలేదు. సహజ ప్రకృతి ప్రక్రియ ద్వారా వెలువడింది. ఈ ఐస్‌కేఫ్ బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ అధికారులు వెలుగులోకి తీసుకొచ్చారు. ఇది లే నుంచి 75 కిలోమీటర్ల దూరం ఉన్నది. లడఖ్‌కు వచ్చే సందర్శకులను ఆకర్షించేందుకు ఈ ఐస్‌కేఫ్‌ను ప్రారంభించారు. గుహ మాదిరిగా ఉన్న దీనిలో హాట్‌డ్రింక్స్, నూడుల్స్‌వంటి ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారు.



# కొత్త ప్రదేశానికి వెళ్తే ఎక్కడ తినాలో?

ఓ పట్టాన అర్థం కాదు. మంచి హోటల్ ఎక్కడుందో తెలియదు. ఇలాంటి సమయాల్లో చాలామంది ఆన్‌లైన్ రివ్యూలపై ఆధారపడుతుంటారు. ఈ రేటింగ్స్ ఎక్కువగా పర్యాటకులే ఇస్తుంటారు. సదరు రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు వాళ్లకు ఎదురైన అనుభవాన్ని బట్టి రివ్యూలు రాసేస్తుంటారు. అందుకే వాటిని గుడ్డిగా నమ్మేయొద్దు. ఒక ప్రాంతంలో ఉన్న రెస్టారెంట్లు, ఆహార విషయాలు స్థానికులకు తెలిసినంతగా.. చుట్టపు చూపుగా వచ్చిన పర్యాటకులకు అంతగా తెలియకపోవచ్చు. అందుకే ఆన్‌లైన్ రివ్యూలు కాకుండా.. స్థానికుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ఎక్కడ తినాలో నిర్ణయించుకోవాలి. స్థానిక రుచుల గురించి ఆరా తీయాలి.. ఆరగించాలి. మరో విషయం ప్రయాణాల్లో చాలామంది స్ట్రీట్ ఫుడ్ జోలికి వెళ్లరు. అన్ని సమయాల్లోనూ ఇది సరికాదు. బడ్జెట్‌లో వేడివేడి రుచులు కావాలన్నా.. ఆ ప్రాంతానికే ప్రత్యేకమైన రుచులు ఆస్వాదించాలన్నా స్ట్రీట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లాలి. అక్కడ రుచికరమైన ఆహారం దొరుకుతుందో లేదో తెలుసుకోవడం కూడా సులభమే! సాధారణంగా స్ట్రీట్‌ఫుడ్ సెంటర్స్‌కు స్థానికులే ఎక్కువగా వెళ్తుంటారు. ఎక్కడ రద్దీగా ఉంటుందో.. అక్కడికి వెళ్లి ఓ పట్టు పట్టేయడమే. రుచి బాగుంటేనే కదా రద్దీ ఎక్కువగా ఉండేది!

దిన పత్రిక తొలి సమయం



# తేనెటీగల పెంపకంతో నెలకు 18వేల వరకు అదనంగా సంపాదిస్తున్న రైతన్నలు

**ఒకప్పుడు అడవుల్లో, భారీ చెట్ల వద్ద మాత్రమే దొరికే తేనె ఇప్పుడు వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమగా మారుతున్నది. కేవలం ఆంధ్ర, ఇతర ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన పెంపకం తెలంగాణకు క్రమంగా విస్తరిస్తున్నది. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడం, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఈ 'బీ కీపింగ్' (తేనెటీగల పెంపకం) కాసుల వర్షం కురిపిస్తున్నది. ఒక్కసారి పెట్టుబడి పెట్టి.. అనువైన స్థలంలో మొదలుపెడితే క్రమం తప్పకుండా మంచి ఆదాయం ఇవ్వడం ప్రత్యేకత కాగా, ఉమ్మడి జిల్లాలో ఇప్పుడిప్పుడే పలువురు రైతులు రాణిస్తున్నారు. ప్రత్యేకంగా 50వేల తేనెటీగలతో కూడిన బాక్కులను కొనుగోలు చేసి తీసుకువస్తూ, ఉద్యానవన పంట క్షేత్రాల వద్ద అమరుస్తూ ఉపాధి పొందుతున్నారు. ఓ వైపు జీవ వైవిద్యాన్ని, పర్యావరణాన్ని జీవవంతం చేస్తూ ఉపాధి పొందుతూనే.. మరో వైపు పంటలకు ప్రాణం పోస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.**



### లాభాల తేనె పట్టు

తేనెటీగలను బాక్స్‌ల్లో పెంచుతారు. ఒక్కో బాక్స్‌లో మైనం షీట్స్ కలిగిన 8–10ఫ్రేంలు ఉంటాయి. వాటిల్లోనే తేనెటీగలు ఉంటాయి. బయటికి వెళ్లడానికి, రావడానికి బాక్సు నుంచి ఒకే దారి ఉంటుంది. బాక్స్ మూత తీసినా ఆ వైపు నుంచి తేనెటీగలు లేచి పోవు. మొత్తంగా ఒక బాక్స్‌లో 50వేల నుంచి లక్ష తేనెటీగలు ఉంటాయి. ఇందులో ఒక రాణి( పరిపూర్ణమైన ఆడ ఈగ, క్వీన్‌బీ అంటారు). వేల సంఖ్యలో కూలీ ఈగలు (అసంపూర్ణమైన ఆడ ఈగలు), వందల సంఖ్యలో మగ ఈగ(వీటిని డ్రోన్స్ అంటారు)లు ఉంటాయి. ఇవి రాణి ఈగ డైరెక్షన్‌లో పనిచేస్తాయి. మరికొన్ని ఈగలు పూలు, పూతపై ఉండే ఎంజెమ్స్‌ని, పుప్పొడిని, మరికొన్ని మకరందాన్ని, బంకపై ఉండే మైనాన్ని తెస్తాయి. మరికొన్ని ఈగలు రాణి ఈగ కోసం రాజాహారం(రాయల్ జెల్లీ)ని తీసుకొస్తాయి. ఇక బాక్స్‌లో ఉండే ఈగలు మైనంతో గదులను చక్కగా నిర్మిస్తుంటాయి. ఇక మకరందాన్ని తెచ్చిన తీగలు దానిని తేనేగా మార్చి గదుల్లో నింపి సీల్ చేస్తాయి. ఇక బాక్స్‌లో చనిపోయి ఉన్న ఈగలను మరికొన్ని ఈగలు బయటకు పడేస్తూ ఉంటాయి. బాక్స్ ప్రధాన ద్వారం నుంచి లోపలికి కొండ ఈగలు, దోమలు, ఈగలు, బల్లులురాకుండా ఒక 15–20 ఈగలు కాపలా కాస్తుంటాయి.

### రైతులకు అదనపు ఆదాయం

తేనెటీగల పెంపకం రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఉద్యానవన పంటలైన నువ్వులు, ఆవాలు, కుసుమ, కంది పంట చేలల్లో తేనెటీగల పెట్టెలను అమర్చుకొని అధిక లాభాలు సేకరించవచ్చు. ఒక ఎకరం పంటలో సుమారు ఐదు బాక్సులు ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక్కో బాక్సు నుంచి 4 కేజీల తేనె వస్తుంది. ఒక ఎకరా పంటలో 5 బాక్సులు అమర్చినట్లయితే 20 కిలోల తేనెను సేకరించవచ్చు. ప్రస్తుతం స్వచ్ఛమైన తేనె కిలోకు 450 నుంచి 500 పలుకుతుండగా, ఈ లెక్కన 20 కిలోల తేనెకు 9వేల నుంచి 10వేల ఆదాయం పొందవచ్చు. కాగా, మార్కెట్‌లో తేనెటీగల బాక్సు ధర 7500 ఉంటుంది. ఒక్కో బాక్సులో 50 వేల నుంచి లక్ష దాకా తేనెటీగలు ఉంటాయి.

### బహుళప్రయోజనాలు

తేనె టీగల పెంపకంతో బహుళ ప్రయోజనాలున్నాయి. నిర్వహకులకు తక్కువ పెట్టుబడికే ఎక్కువ లాభాలు కండ్లచూడవచ్చు. సంవత్సరం పొడవునా వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా వీటిని పెంచవచ్చు. ఇక స్థానికంగా తక్కువ ధరకే స్వచ్ఛమైన, నాణ్యమైన తేనె వినియోగదారులకు దొరుకుతుంది. తేనెటీగలు అంతరించిపోకుండా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు. పండ్ల, పూల తోటల్లో, కూరగాయల సాగులో రైతులకు అధిక దిగుబడి సాధించడానికి తేనెటీగలు దోహదపడతాయి. పంట పొలాల్లో తేనె టీగలు ఉండడం వల్ల పరాగ సంపర్కం జరిగి సాధారణంగా వచ్చే దిగుబడికన్నా 40శాతం వరకు అధిక దిగుబడులు వస్తాయి. ఈ విషయాన్ని గ్రహించిన పలువురు రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, బాపట్ల నుంచి తేనెటీగలతో ఉన్న ఒక్కో బాక్సును నెలకు రూ.2వేల చొప్పున అద్దెకు తెచ్చుకొని పంట పొలాల వద్ద పెట్టుకుంటున్నారు. ఇటీవల హుజూరాబాద్‌కు చెందిన పలువురు రైతులు బాక్సులను అద్దెకు తీసుకొని వచ్చి పెట్టుకున్నారు.

### అవగాహన లేక నష్టపోతున్న రైతులు

మన ప్రాంతంలోని రైతులకు తేనెటీగల పెంపకంపై అవగాహన లేకపోవడంతో ఎంతో నష్టపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి మన రైతులు సాగు చేస్తున్న ఆవాలు, నువ్వులు లాంటి పంట పొలాల్లో తేనెటీగల పెట్టెలను పెట్టుకొని సొమ్ము చేసుకుంటున్నారు. పెట్టెలను అమర్చడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందని చెబుతుండడంతో రైతులూ ఒకే చెప్పేస్తున్నారు. కానీ దాని వల్ల వచ్చే లాభాలను మాత్రం గుర్తించలేకపోతున్నారు. దీనిని గుర్తించిన పొలాస పరిశోధనా స్థానం తేనెటీగల పెంపకం వైపు రైతులను ప్రోత్సహిస్తున్నది.

### పొలాస ఆధ్వర్యంలో శిక్షణ

మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులను వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో రాణించేలా పొలాస వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషిచేస్తున్నది. అందులో ప్రధానంగా మార్కెట్‌లో అధిక డిమాండ్ పలుకుతూ, తక్కువ పెట్టుబడితో.. ఎక్కువ ఆదాయాన్నిచ్చే తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నది. ఈ క్రమంలో తేనె టీగల పెంపకంపై పరిశోధనా స్థానంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నది.

పెంపకం, వాటి పరిశ్రమ ఏర్పాటుకు కావల్సిన సలహాలు, సూచనలు ఒక్కో రైతుకు వారంపాటు శిక్షణ ఇస్తున్నది. వారం రోజులపాటు ట్రైనింగ్ ఇవ్వడంతోపాటు తేనె సేకరించేందుకు కావాల్సిన తేనెటీగల పెట్టెలను అందిస్తున్నది. అంతేకాదు పరిశోధనా స్థానంలోనే ప్రయోగాత్మకంగా బాక్సుల్లో బీ కీపింగ్ చేస్తూ వాటిని రైతులకు చూపిస్తూ తేనె ఎలా తయారుచేయవచ్చో అర్థమయ్యేలా వివరిస్తున్నది.

### నెలకు రూ.18 వేలు సంపాదిస్తున్నా..

నాకు ఏడెకరాల భూమి ఉంది. అందులో రెండెకరాలల్ల మామిడి తోట పోను ఐదెకరాల్లో నువ్వు, ఆవాలు, కంది సాగుచేస్తున్న. నేను గతేడాది హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో తేనెటీగల పెంపకంపై ఎనిమిది రోజుల శిక్షణ తీసుకున్నా. ఒక్కో బాక్సులో 50 వేల నుంచి లక్ష తేనెటీగలు ఉండే బాక్కులను 40 కొనుగోలు చేసిన. ఒక్కో బాక్సు ధర రూ.7500 పడ్డది. నా వ్యవసాయ క్షేత్రంలో బాక్సులను పెట్టిన. నెలకు 30–40 కిలోల తేనె తయారైతున్నది.

కిలోకు రూ.450 చొప్పున అమ్ముతున్నా. నెలకు రూ.18 వేలపైనే ఆదాయం వస్తోంది. ఇంకా ఈ తేనెటీగల పెంపకం చేపట్టినప్పటి నుంచి నా పంటల దిగుబడి బాగా వస్తోంది. నేను తయారు చేసే తేనెకు మార్కెట్లో డిమాండ్ బాగుంది. హైదరాబాద్ లాంటి మహానగరాల నుంచి వచ్చి కొనుక్కెళ్తారు. వీలుగాని వారికి కొరియర్ ద్వారా పంపిస్తున్నా. నా కస్టమర్ల నంబర్లతో వాట్సప్ గ్రూప్ కూడా తయారు చేసిన.

### అదనపు ఆదాయం

తేనె వినియోగం బాగా పెరిగింది. డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి జరగడం లేదు. అందుకే ఈ తేనె టీగల పెంపకాన్ని చేపట్టిన రైతులకు అధిక లాభాలుంటాయి. ప్రభుత్వం కూడా తేనె ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నది. ఆవాలు, నువ్వులు, మినుములు వంటి పంటలు వేసే రైతులు తమ తోటల్లో బాక్సులను ఏర్పాటు చేసుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చు. తేనె దిగుబడితోపాటు ఇంకా పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

## "లంబాడీ భేరి"కి వేలాదిగా తరలిరండి.





తొలి సమయం, వనపర్తి, సెప్టెంబర్ 23ఈ నెల 26న బి.ఆర్.ఎస్ ఆధ్వర్యములో జరిగే లంబాడీలకు కె.సి.ఆర్ అన్నం పెడితే....రేవంత్ రెడ్డి సున్నం పెడుతున్నాడు.అభివృద్ధి చేతకాక కులాల మధ్య చిచ్చుపెడుతున్న కాంగ్రెస్ పార్టీలంబాడీ భేరి సన్నాహక సమావేశంలో పాల్గొని మద్దతు ప్రకటించి దిశా నిర్దేశం చేసిన మాజీ మంత్రివర్యులు. ఆదివాసులతో పాటు లంబాడీ హక్కులు కాపాడాలి అని స్పష్టం చేసిన గౌరవ నిరంజన్ రెడ్డి గారు. కె.సి.ఆర్ గారు లంబాడీల భవిష్యతు కోసం అనేక సంక్షేమ పథకాలు పోడు భూములకు పట్టాలు ప్రత్యేక గ్రామ పంచాయతీల ఏర్పాటు కళ్యాణ లక్ష్మీ,రైతు భరోసా, రైతు బీమా,రైతు రుణ మాఫీతో లంబాడీల రిజర్వేషన్లకు భంగం వాటిల్లకుండా మా హక్కులు కాపాడితే నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న మంత్రి సీతక్క ఎస్.టి.జాబితా నుండి తొలగించాలని సుప్రీం కోర్టులో కేసులు వేయించాడని తీవ్రంగా ఖండించారు. ఎస్.టి. జాబితా నుండి లంబాడీలను తొలగించాలి అని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగ బి. ఆర్.ఎస్ ఆధ్వర్యములో ఈ నెల 26న లంబాడీల భేరి నిర్వహిస్తున్నామని లంబాడీలు అధిక సంఖ్యలో తరలివచ్చి మన హక్కుల కోసం చేస్తున్న పోరాటాన్నికి మద్దతు తెలపాలని గౌరవ నిరంజన్ రెడ్డి స్వగృహంలో జరిగిన సన్నాహక సమావేశములో జిల్లా ఎస్.టి.సెల్ అధ్యక్షులు చంద్రశేఖర్ నాయక్,మాజీ ఎం.పి.పి కృష్ణా నాయక్, జాత్రు నాయక్ పిలుపునిచ్చారు.ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుతనాన్ని గుర్తించి నాటి అనాటి ప్రధాని ఇందిరమ్మ రిజర్వేషన్లు కల్పిస్తే నేడు వచ్చిన కల్తీ కాంగ్రెస్ నాయకులు లంబాడీలను ఎస్.టి జాబితాను తొలగించాలని చూస్తున్నదని నిప్పులు చెరిగారు.మా పోరాటం ఆదివాసులకు వ్యతిరేకం కాదని మా రిజర్వేషన్లకు భంగం కలిగించవొద్దని మా పోరాటం అని నాయకులు స్పష్టం చేశారు.లంబాడీల పోరాటానికి మద్దతు ప్రకటించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు. 26న జరిగే లంబాడీల భేరికి రావాలని గిరిజన నాయకుల ఆహ్వానం మేరకు సన్నాహక సమావేశములో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గారు మాట్లాడుతూ.... లంబాడీల నోటికాడి ముద్దను కాంగ్రెస్ పార్టీ లాక్కోవాలని చూస్తుందని దీని బి.ఆర్.ఎస్ పార్టీ సహించదని హెచ్చరించారు. రాష్ట్రములో ఉన్న ఆదివాసులకు తాము వ్యతిరేకం కాదని కానీ గిరిజనులను ఎస్.టి జాబితా నుండి తొలగించాలన్న ప్రతిపాదన ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లంబాడీలు చేసే న్యాయమైన పోరాటానికి మా మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.నారాయణ నాయక్, టీక్యా నాయక్,కృష్ణా నాయక్,గోపాల్ నాయక్, పీన్యా నాయక్,రమేష్ నాయక్,శ్రీను నాయక్,రాజ్ కుమార్ నాయక్,గోవిందు నాయక్,పెద్దమందడి.కృష్ణా నాయక్,శక్రూ నాయక్ మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# డ్రాగన్‌ఫ్రూట్‌తో ఎకరానికి లక్ష ఆదాయం..

# 5 లక్షల పెట్టుబడితో 20 ఏండ్ల దాకా దిగుబడి

**సంప్రదాయ సాగుతో విసిగిపోయిన రైతులు.. తక్కువ శ్రమతో దీర్ఘకాలం పాటు ఎక్కువ లాభాలు తెచ్చి పెట్టే పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న డ్రాగన్ ఫ్రూట్ సాగును ఎంచుకొని మంచి ఆదాయం పొందుతున్నారు. ఎకరానికి లక్ష వరకూ మిగులుతుండడంతో ఒకరి తర్వాత ఒకరు పంట సాగు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మానుకోట జిల్లాలో తొలుత ప్రయోగాత్మకంగా మొదలైన డ్రాగన్ ఫ్రూట్ సాగు ఇప్పుడు క్రమంగా 15 ఎకరాలకు చేరడం విశేషం. ఎకరానికి రూ.5లక్షల పెట్టుబడితో 20 ఏళ్ల పాటు దిగుబడినిచ్చే పంట కోసం ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుండడంతో పాటు అంతర పంటగా కర్బూజ, పుచ్చకాయ, కూరగాయలు వేసి అదనపు ఆదాయమూ పొందే వీలుండడంతో రైతులు హుషారుగా పంట వేస్తున్నారు.**



డ్రాగన్ ఫ్రూట్‌తో రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. ఎకరాకు లక్ష రూపాయల ఆదాయం వస్తుండడంతో మహబూబాబాద్ జిల్లాలో సాగు చేసేందుకు ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌ను ఎత్తుగా ఉండే నేలల్లో పంట వేయాలి. ఒక మొక్క రూ.60లకు లభిస్తుంది. జడ్జర్ల, రంగారెడ్డి జిల్లాలో ఉండే నర్సరీలలో మొక్కలు దొరుకుతాయి. ముందుగా భూమిని చదును చేసుకున్న తర్వాత సిమెంట్ స్తంభాలు నాటాలి. ఒక స్తంభానికి, మరో వరుస స్తంభానికి మధ్య ఎనిమిది ఫీట్ల దూరం ఉండాలి. ఎత్తు ఏడు ఫీట్ల వరకు ఉండాలి. ప్రతి స్తంభం పైభాగంలో సిమెంట్ బిల్లలు అమర్చాలి.

డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను నాటిన రెండు సంవత్సరాలకు పంట చేతికి వస్తుంది. ఒకసారి పంట ప్రారంభమైన తర్వాత 20 సంవత్సరాల వరకు దిగుబడి వస్తూనే ఉంటుంది. ఎకరానికి సుమారు రూ.5లక్షల పెట్టుబడి అవుతుంది. ఎకరాకు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. కిలో డ్రాగన్ ఫ్రూట్స్‌కు రూ.250లు చొప్పున విక్రయిస్తున్నారు. ఒక క్వింటాల్‌కు రూ.25వేలు వస్తుంది. మొత్తం 30 క్వింటాళ్లకు రూ.7.50 లక్షల ఆదాయం వస్తుంది. అన్ని ఖర్చులు పోను ఎకరానికి ఏటా లక్ష వరకు ఆదాయం వస్తుంది. ఇందులో అంతర పంటగా పుచ్చ, కర్బూజతో పాటు కూరగాయలు సాగు కూడా చేసుకోవచ్చు. తద్వారా రైతుకు అదనపు ఆదాయం వస్తుంది.

డ్రాగన్ ఫ్రూట్స్‌తో లాభాలు వస్తుండడంతో రైతులు ఈ పంట వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కకు ముళ్లు ఉండడం వల్ల కోతుల బెడద కూడా ఉండదు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 15 ఎకరాల్లో ఐదుగురు రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో ఇప్పటికే మరిపెడలో ఒక రైతు, గూడూరు మండలంలో మరో రైతు ప్రయోగాత్మకంగా డ్రాగన్ ఫ్రూట్ పంట వేశారు. ఒక ఎకరాకు రూ.లక్ష ఆదాయం వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేను రెండు సంవత్సరాల క్రితం ఎకరమున్నర భూమిలో డ్రాగన్ ఫ్రూట్ పంట వేశాను. నాకు పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కిలోకు రూ.200 చొప్పున పది క్వింటాళ్లకు రూ.2లక్షలు వచ్చాయి. ఇందులో పెట్టుబడి రూ.50వేలు పోను మిగతా రూ.1.50 లక్షల ఆదాయం వచ్చింది. నాకు ఉద్యానశాఖ నుంచి మొత్తం రూ.90వేల సబ్సిడీ వచ్చింది. డ్రాగన్ ఫ్రూట్స్ పంట చేతికి రాగానే ఖమ్మం, వరంగల్ మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మేస్తాను. ఈ ఏడాది కూడా ఇంకా అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మే నుంచి జూన్‌లో పంట మళ్లీ కోతకు వస్తుంది.

నాకు మూడెకరాల భూమి ఉంది. ఇందులో ఒక ఎకరం భూమిలో డ్రాగన్ ఫ్రూట్ వేశాను. ఇప్పటికే రెండు మార్లు పంటను అమ్మాను. ఒక ఎకరాకు 30 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. పెట్టుబడి, కూలీల ఖర్చు అన్నీపోను లక్ష మిగులుతాయ్.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS H-NO 1-6-155/43/45/4
NANDI NAGAR POST : MANDAL DIST : MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101